# గీతోపనిషత్

(శ్రీమద్భగవద్గీత 2వ అధ్యాయము - సాంఖ్య యోగము)

మాస్టర్ కె. పార్వతీకుమార్

ధనిష్ఠ

ఈ ప్రచురణ యొక్క కంటెంట్ సద్భావన చర్యగా మరియు వ్యక్తిగత ఉపయోగం కోసం మాత్రమే ఉచితంగా ఇవ్వబడుతుంది. దానిని అలానే ఉంచడం మన బాధ్యత.
విధంగానైనా లేదా ఏ ప్లాట్‌ఫారమ్‌లోనైనా వాణిజ్యీకరణ నిషేధించబడింది, అలాగే ప్రచురణకర్త యొక్క వ్రాతపూర్వక అనుమతి లేకుండా పంపిణీ, లేదా పూర్తిగా, లేదా కొంత భాగాన్ని ప్రచురించడం నిషేధించబడింది. అన్ని హక్కులూ గ్రంధకర్తవి, ప్రచురణకర్తవి.

ప్రథమ ముద్రణ : 2005
ప్రతులు : 1,000

వెల : రూ॥ **25-00**

ప్రాప్తిస్థానము :
జగద్గురు మందిరము
(ది వరల్డ్ టీచర్ టెంపుల్)
'రాధామాధవమ్',
14-38-2, ముప్పిడి కోలనీ,
విశాఖపట్నం - 530 002.

ముద్రణ :
♒ ఎక్వేరియన్ ప్రింటింగ్ స్కూల్
విశాఖపట్నం - 530 016.
☏ 2747320, 2751329.

# ధనిష్ఠ

## స్వచ్ఛంద సేవా సంస్థ

**"ధనిష్ఠ"** అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువలేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శృతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్చుచేసి వ్యాప్తి చేయుటకు "ధనిష్ఠ" 1992లో జన్మించినది.

**"ధనిష్ఠ",** డా॥ కంభంపాటి పార్వతీకుమార్ గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపము లోను, పుస్తకముల రూపములోను భద్రపరచి సత్సాధకుల కందునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

**"ధనిష్ఠ"** ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును, సద్గోష్ఠికై వలసిన వాతావరణమును - "జగద్గురు మందిరము" గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

## సంకలనకర్త : మాస్టర్ కంభంపాటి పార్వతీకుమార్

**మా**తృదేశము మొదలుగా ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా మరియు ఐరోపా ఖండములలోగల ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు ప్రచోదనము కలిగించుచూ, భక్తి, జ్ఞానము, వైరాగ్యము, యోగాభ్యాసము యిత్యాది విషయములలో బోధనలు గావించుచూ, పరమగురువుల మార్గానుయాయులకు వెలుగుదారి చూపించుచున్న సత్సాధనా సంపత్తిగల నవయుగ యోగ మార్గదర్శి **మాస్టర్ కంభంపాటి పార్వతీకుమార్** గారు. వారి బోధనలు లెక్కకు మించి యున్ననూ, పలురకములైన విషయ, విజ్ఞాన బోధనలుగా తెలియవచ్చును. అవి బోధనలుగానే కాకుండా నిత్యజీవితమున అనుసరణీయమై, ఆచరణయోగ్యమై, ఆచరించువారికి సత్యదర్శనమున సత్వర ఫలితముల నందించుచున్నవని తెలుపుట అతిశయోక్తి కానేరదు.

సాంఘిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళా రంగములలో వారి నిరంతర సేవలను గుర్తించి, గౌరవించి, ఆంధ్ర విశ్వకళా పరిషత్ **"డాక్టర్ ఆఫ్ లెటర్స్"** పట్టానందించి, ఆదర్శవంతమైన వారి సేవలను కొనియాడినది.

ఆర్థిక, సాంఘిక, సేవారంగములలో - మానవాళి మనుగడలో సుఖము, శాంతి పరిమళింపజేయు సూత్రముగా ఆధ్యాత్మికత అలరారినప్పుడే, దానికి సాఫల్యత, సార్థకత ఉండునని, "మానవ సేవయే మాధవసేవ" అను మాటకు సరియైన అర్థము యిదేనని శ్రీ కుమార్‌గారు తమ ప్రవర్తన ద్వారా తెలియపరచుచున్నారు. శ్రీ పార్వతీకుమార్ బాధ్యతగల గృహస్థులు, పేరున్న ఆర్థిక సలహాదారు,

విజ్ఞానమును వికసింపజేయు గురువు, శారీరక - మానసిక రుగ్మతలను తొలగింపజేయు వైద్యులు, అనేక గ్రంథముల సంకలనకర్త, నిగర్వి, నిర్మల హృదయులు.

జ్ఞానము ఏ ఒక్కరికి  చెందినది కాదనియు, జ్ఞానులు సైతము అందరునూ జ్ఞానమునకే చెందిన వారనియూ, జ్ఞానమే సరియగు వాహికల నెన్నుకొని తనను తాను ప్రకటించుకొను చుండుననియూ, అందుచే నిజముగా ఎవ్వరూ గ్రంథకర్తలు కాజాల రనియూ, సంకలన కర్తలే ననియు శ్రీ కుమార్‌గారి దృఢవిశ్వాసము. విశేష పరిజ్ఞానముగల ప్రతిభావంతు లైనప్పటికి సౌశీల్యముతో సామాన్యుల మిత్రత్వము నభిలషించు సమవర్తి.

శ్రీ పార్వతీకుమార్‌గారి ఆధ్వర్యమున ఎన్నియో ధార్మిక సంస్థలు దేశవిదేశములలో పరహితసేవ గావించుచున్నవి. "పరహితము పరమధర్మ" మను ఆర్యోక్తి వారి జీవితమును నడిపించుచున్నది. భగవధ్యానము, స్వాధ్యాయము, పరహితములకు త్రిధాబద్ధులుగా ఎందరో ఆస్తికులకు వారు ప్రపంచమున ప్రచోదనము గావించుచున్నారు. పరమగురు పరంపర వారి కాదర్శము.

**- ధనిష్ఠా ఫౌండేషన్**

# ముందుమాట

భగవద్గీత సర్వోత్కృష్టమైన గ్రంథము. కర్మాచరణమునకు, ధర్మాచరణమునకు, భక్తి జ్ఞాన వైరాగ్యములకు, మోక్షపదమునకు ప్రామాణిక గ్రంథము. భగవద్గీతపై అనేకానేక వ్యాఖ్యానములు గలవు. ఇకపైన గూడ రాగలవు.

నావాణి యందు గీతా వ్యాఖ్యానము, "గీతోపనిషత్" అను శీర్షికగా పాఠకులకు అందింపబడినది. ప్రతి అధ్యాయము తనదైన సందేశము నందించుట గీతయందలి విశిష్టతయగుటచే అధ్యాయమున కొక పుస్తకముగా సామాన్య పాఠకులకు భగవంతుని సందేశము నందించు ప్రయత్నము "ధనిష్ఠ" సంకల్పించినది. మాస్టర్ పార్వతీకుమార్ గారిచే అందించబడిన వ్యాఖ్యానము సామాన్యులకు కూడ స్ఫూర్తి కలిగించు విధముగ నుండుటచే ఈ ప్రచురణ చేపట్టితిమి. మొదటిగ సాంఖ్యయోగము ముద్రించుటకు సంకల్పించితిమి. మిగిలిన ఆధ్యాయములు గూడ కాలక్రమమున ప్రచురించ బడగలవు.

– ధనిష్ఠ

# పరిచయము

**భ**గవద్గీత యోగశాస్త్రము. అందు బ్రహ్మవిద్య నిక్షిప్తమై యున్నది. అది ఉపనిషత్తు కూడ. భగవద్గీత యందు జ్ఞానపరముగ తెలుపబడని విషయము లేదు. ఆచరణాత్మకముగ గూడ తెలుపబడని విషయము లేదు. అది పరిపూర్ణ గ్రంథము. పురాణ పురుషుడు శ్రీకృష్ణుడు మానవుల నుద్దేశించి యిచ్చిన యోగమార్గమది.

భగవద్గీత యందు పదునెనిమిది అధ్యాయములు గలవు. పదునెనిమిది సోపానములలో జీవుడు దైవముగమారు మార్గము లేక జీవాత్మ పరమాత్మను చేరు మార్గము తెలుపబడినది. ప్రతి అధ్యాయమునందు సృష్టి రహస్యమొకటి తెలుపబడినది. అవగాహనతో ఆచరించు జీవునకు మార్గము సుగమము.

**గీత ఆచరణాత్మక గ్రంథమగుటచే ఆచరణమే ఈ మార్గమునకు ప్రధానము. పారాయణములు స్ఫూర్తి కొరకే. ఆచరణయే**

**వికాసము కలిగించును. యజ్ఞార్థము కర్మాచరణ మాచరించు వారికే భగవద్గీత తెలియనగును. ఇతరులకు పాండిత్యమునకే పనికివచ్చును గాని మార్గము లభ్యము కాదు.**

నిత్యజీవితమున నిర్దిష్టమగు యోగమార్గమును అనుసరించుటకు, దివ్యానుభూతిని అనునిత్యము ఆస్వాదించుటకు దైవము యోగమార్గము నందించెను. కర్మము, ధర్మము, దైవము, సృష్టి విజ్ఞానము వివరింపబడినది. అసంగుడై సృష్టియందెట్లు దివ్య వైభవమును కొనియాడుచు జీవించదగునో తెలిపెను. ఇట్టి భగవద్గీత పరిష్కారము కోరు మానవునకు కరదీపిక.

ఆధునిక యుగమున గీతాసూత్రముల ఆవశ్యకత ఇందు గోచరించగలదు. ఈ వాఖ్యానములు పాఠకులకు స్ఫూర్తి కలిగించినచో ఈ ప్రయత్నము యజ్ఞార్థఫలమే కాగలదు.

- పార్వతీకుమార్

# విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| | సందేశము | ..... | 11 |
| 1. | మనోవిజయము | ..... | 12 |
| 2. | మేలుకొలుపు (ఉత్తిష్ఠ) | ..... | 14 |
| 3. | శరణాగతి | ..... | 16 |
| 4. | తృష్ణ – తృప్తి | ..... | 19 |
| 5. | నిజమైన తెలివి | ..... | 22 |
| 6. | దివ్యజ్ఞానము | ..... | 24 |
| 7. | వచ్చి పోవునవి – ఓర్పు | ..... | 26 |
| 8. | అమృతత్వము – అర్హత | ..... | 29 |
| 9. | ఉన్నది పోదు – లేనిది రాదు | ..... | 31 |
| 10. | మార్పు – మహత్త్వం | ..... | 34 |
| 11. | యోగవిద్య – అభ్యాసము | ..... | 37 |
| 12. | ఆత్మ | ..... | 39 |
| 13. | ఆత్మ – అద్భుతము – ఆశ్చర్యము | ..... | 41 |
| 14. | అశోకత్వము | ..... | 42 |
| 15. | ధర్మము | ..... | 44 |
| 16. | భయము – భద్రత | ..... | 46 |
| 17. | వ్యవసాయము | ..... | 48 |
| 18. | అనర్హుడు | ..... | 50 |
| 19. | తుదిమెట్టు | ..... | 51 |
| 20. | ఆచరణ – ఎఱుక | ..... | 53 |

| | | | |
|---|---|---|---|
| 21. | కర్మ సూత్రము | ..... | 55 |
| 22. | కర్మ సూత్రము | ..... | 57 |
| 23. | కర్తవ్యము పాప - పుణ్యములు | ..... | 60 |
| 24. | మనీషి | ..... | 62 |
| 25. | స్థిత ప్రజ్ఞుడు | ..... | 65 |
| 26. | స్థిత ప్రజ్ఞుడు | ..... | 67 |
| 27. | స్థిత ప్రజ్ఞుని లక్షణములు | ..... | 68 |
| 28. | స్థిర చిత్తము | ..... | 69 |
| 29. | ఆత్మ చింతన | ..... | 71 |
| 30. | ఇంద్రియములు - సౌలభ్యము - ప్రమాదము | ... | 74 |
| 31. | మత్పరత్వము | ..... | 76 |
| 32. | ప్రసాదము | ..... | 78 |
| 33. | ప్రసాద స్థితి | ..... | 81 |
| 34. | చిత్త శుద్ధి | ..... | 84 |
| 35. | అంకుశము | ..... | 86 |
| 36. | హెచ్చరిక | ..... | 88 |
| 37. | చీకటి - వెలుగు | ..... | 90 |
| 38. | కామ స్వరూపం | ..... | 92 |
| 39. | శాంతి సూత్రము | ..... | 94 |
| 40. | బ్రహ్మ నిర్వాణము | ..... | 97 |

# సందేశము

గీత, గంగ, గోవింద, గాయత్రి అను గకారముతో ప్రారంభింపబడు ఈ నాలుగింటి యందు ఏ ఒకటి యైనను హృదయము నందు స్థితి గొనినచో మానవుడు పునీతుడు కాగలడు. సాక్షాత్తు పరమపురుషుడే ఈ లోకమునకు దిగివచ్చి అందించిన అద్భుతమైన సందేశము భగవద్గీత. సంస్కృతము తెలియనివారు కనీసము గీతను అధ్యయనము చేయుట కొఱకైనను సంస్కృతమును నేర్చుకొనుడు అని జాతిపిత మహాత్మాగాంధీ ఉద్బోధించెను. ఈ గీతను అధ్యయనము చేయనివాడు సంస్కృతిని నిరసించినవాడే. అతడు భారతీయుడు కాజాలడు. భగవద్గీత బ్రహ్మవిద్యా సారము, సమగ్రమైన యోగము నందించు మార్గదర్శి. ఉపనిషత్తుల సమస్త సారమును గీతయందు దర్శించవచ్చును.

# 1

# మనోవిజయము

శ్రీభగవా నువాచ :

కుతస్త్వా కశ్మల మిదం విషమే సముపస్థితమ్ ।
అనార్యజుష్ట మస్వర్గ్య మకీర్తికర మర్జున ॥ 2

భగవంతుని మొట్టమొదటి శాసనము కశ్మలమును వీడమని. "కుతస్త్వా కశ్మలమ్ ఇదమ్" అని శ్రీకృష్ణుడు ప్రశ్నించుచు తన దివ్యోపదేశమును అందించినాడు. కశ్మలం అనగా మనో వ్యాకులత్వము. అది మోహముచే కలుగును. దాని వలన శోక మేర్పడును. పిరికితన మావరించును. మనస్సు మలినము చెందినదై సమస్తమును గజిబిజి చేయును. అనాచార్యము నాదరించుట జరుగును. స్వర్గము అనగా సువర్గము. అనగా వైభవము నుండి పడద్రోయును. అపకీర్తిని కట్టబెట్టును. ఎట్టి విపత్కర పరిస్థితుల యందును మనసు వ్యాకులము చెందకుండుటయే స్థితి ప్రజ్ఞత్వము. భాగవతుల జీవితమున దీనిని ప్రస్ఫుటముగ గమనించవచ్చును. సులభముగ, త్వరితగతిని మనసు చెదరువారు బలహీనులు. వారిచే ఎట్టి ఘనకార్యములు నిర్వర్తింపబడవు.

"అనార్యము, నరకము, అపకీర్తి కట్టబెట్టు మనోవ్యాకులము నిన్నెట్లావరించినది?" అని భగవంతుడు అర్జునుని (నరుని అనగా మనలను) ప్రశ్నించుచున్నాడు. మనోవ్యాకులము నుండి విముక్తి చెందుటకు మార్గమును బోధించుచున్నాడు. కనుకనే భగవద్గీతకు మనో విజయమని కూడ పేరు కలదు.

## 2

# మేలుకొలుపు (ఉత్తిష్ఠ)

క్లైబ్యం మాస్మగమః పార్థ నైతత్త్వ య్యుపపద్యతే ।
క్షుద్రం హృదయదౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరంతప ॥ 3

ఎట్టి పరిస్థితుల యందును క్లైబ్యమును పొందవలదని, హృదయ దౌర్బల్యము వలదని, అది క్షుద్రమైనదని, కర్తవ్యము నందు నిలబడుమని, పారిపోవలదని, భగవానుడు మరియొక శాసనము చేయుచున్నాడు.

నరుడు సహజముగ తేజోవంతుడు. కావున క్రీనీడలు లేక చీకట్లు క్రమ్ముటకు అవకాశములేదు. ఎంత నల్లమబ్బు అయినను తాత్కాలికమే కాని సూర్యునివలె శాశ్వతము కాదు. తాత్కాలికమగు సంఘటనల యందు తన సహజత్వమును కోల్పోవుట అజ్ఞానము. అర్జునుడు సహజముగ తేజోవంతుడు. పరాక్రమవంతుడు. పరంతపుడు అనగా శత్రువులను తపింప చేయువాడు మరియు పరమును గూర్చి తపించువాడు. అనగా దైవమును గూర్చి తపించువాడు. అట్టి తపము కారణముగ లోపల,

బయట శత్రువులు జయింపబడుదురు. దైవము అనగా విశ్వ వ్యాప్తమైన తేజము. దానిని గూర్చి తపించువానికి ధైర్యమెట్లు కలుగగలదు. దాని నుండి విడివడుట, తాత్కాలిక సన్నివేశమునకు ముడిబడుట కారణముగ అధైర్యము, మనో దుర్బలత్వము కలుగును. దైవమును ఆశ్రయించుటయే అట్టి సమయమున పరిష్కారము.

"పరంతపుడవైన ఓ నరుడా! కర్తవ్యమున మేల్కొనుము. క్షుద్రమైన హృదయ దౌర్బల్యమును వీడుము. అధైర్యమును పొందకుము. ఇది నీకు తగదు" అని భగవానుడు శాసించు చున్నాడు.

*గమనిక :* ఈ శ్లోకమున భగవానుడు నరుని 'పరంతపుడని' సంబోధించుటలో గంభీరార్థము కలదు.

# 3

## శరణాగతి

కార్పణ్య దోషోపహతస్వభావః
పృచ్ఛామి త్వాం ధర్మ సమ్మూఢచేతాః ।
య చ్ఛ్రేయ స్స్యా న్నిశ్చితం బ్రూహి తన్మే
శిష్యస్తేఽహం శాధి మాం త్వాం ప్రపన్నమ్ ॥ 7

మనోవ్యాకులతను చెందినవాడు, మోహమున పడినవాడు, పిరికితనముచే భయము ఆవహించినవాడు, శోకతప్తుడు, హృదయమును దుర్బలత్వమునకు తాకట్టు పెట్టినవాడు, అవగాహనయందు తికమక గలవాడు, కర్తవ్యమును గ్రహింపలేనివాడు, విచక్షణను కోల్పోయినవాడు, ధర్మ విషయమున సందేహము కలిగి సంకటమున పడినవాడు, అట్టి విషమస్థితి నుంచి బైట పడుటకు తెలిసిన వారిని ఆశ్రయించవలెను. ఈ ఉపాయమును గీత నిస్సందేహముగ స్థాపించుచున్నది. గీతోపాయమును అందు కొనిన బుద్ధిమంతునకు తన గీత మారగలదు.

"శిష్యస్తేఽహం శాధి మాం త్వాం ప్రపన్నమ్" (2-7) అని

అర్జునుడు కోరుటయే అతనికి తరణోపాయమును చూపినది. నేను నీకు శిష్యుడను, నన్నాజ్ఞాపింపుము, నిన్ను శరణు పొందితిని అని అర్జునుడు ప్రార్థించెను. తరించెను.

మనము కూడ క్లిష్ట సమయముల యందు పఠింపవలసిన ఏకైక మంత్ర మిదియే. భగవంతుని సంబోధించుచూ "నేను నీ శిష్యుడను, నిన్ను శరణాగతి చెందితిని, నన్ను శాసింపుము" అని మరల మరల ప్రార్థింపవలెను. ఈ ప్రార్థన ఎంత ఆర్తితో చేసినచో అంత పరిష్కారము దొరుకుటకు వీలుపడును. అర్జునుడు తా నేమి చేయవలెనో తెలియగోరు చున్నాడు. చేసిపెట్టమని అడుగుట లేదు.

సోమరితనము కలిగినవాడు గురువు తనకు చేసిపెట్ట వలెనని ఎదురు చూచుచుండును. దారి చూపుటయే గురువు వంతుకాని నడచుట శిష్యుని వంతుయే. ఇట్టి గురుశిష్య సంప్రదా యమును అందించిన ఉత్తమమైన సంప్రదాయము మనది. శరణాగతి చెందిన శిష్యునకు గురువు బోధ చేయుటకు ఉన్ముఖు డగును. ఉపాయమును చూపిన గురువుయందు సందేహము పడుట కూడదు. సందేహమున్నచో గురువునే అడిగి పరిష్కరించు కొనవలెనుగాని, ఇతరులతో చర్చించుట, సంప్రదించుట నీచము.

అర్జునుడు కర్తవ్యమును సంపూర్ణముగ నెరుగుటకు శ్రీకృష్ణుని మరల మరల ప్రశ్నించెను. అది పరిప్రశ్నమే. "పరి

ప్రశ్నము చేయు శిష్యునియందు సద్గురువునకు వాత్సల్యము హెచ్చగును. పరిప్రశ్నము లేక గురువును ప్రశ్నింపరాదు. పరిప్రశ్నము చేసినపుడు సద్గురువైనచో కోపము రాదు. గురువునకు కొన్ని అర్హతలు కలవు. సద్గురువు తపస్వి అయి వుండవలెను. తనను తాను తెలిసినవాడై వుండవలెను. ధర్మము నాచరించువాడై యుండవలెను.

ఈ గురుశిష్య సంబంధము అత్యంత పవిత్రము. దీనిని నిర్మలముగ నుంచుకొనుట శ్రేయస్కరము. క్లుప్తముగ నుంచు కొనుట మరియు శ్రేయస్కరము. బజారు కెక్కించుట కుసంస్కారము.

# 4

# తృష్ణ - తృప్తి

న హి ప్రపశ్యామి మమాపనుద్యా
ద్యచ్ఛోక ముచ్ఛోషణ మింద్రియాణామ్ ।
అవాప్య భూమా వసపత్న మృద్ధం
రాజ్యం సురాణా మపి చాధిపత్యమ్ ॥ 8

*సంజయ ఉవాచ :*

ఏవ ముక్త్వా హృషీకేశం గుడాకేశః పరంతపః ।
న యోత్స్య ఇతి గోవింద ముక్త్వా తూష్ణీం బభూవ హ ॥ 9

త మువాచ హృషీకేశః ప్రహస న్నివ భారత ।
సేన యో రుభయోర్మధ్యే విషీదంత మిదం వచః ॥ 10

ప్రపంచమున నున్న సమస్తమైన ప్రతికూల శక్తులను అణచి వేసినను, దేవతలపై ఆధిపత్యమును సంపాదించినను, సమస్త సంపదలను పొందినను, పదవులను ఆక్రమించినను, ఇవి ఏవియును మనుష్యుని మానసిక అశాంతిని తొలగింపలేవని భగవద్గీత బోధించుచున్నది. "నహిః ప్రపశ్యామి మాం అపనుద్యాత్ శోకం, ఉచ్ఛోషణమ్" (2-8) అని అర్జునుడు పలికినాడు.

అర్జునుడు మహావీరుడు. అతని నామమే వైభవోపేత సంపదను సూచించును. ఇంద్రునితో సమానముగ భూమిపై వైభవముల ననుభవించినాడు. ఇంద్రుని సింహాసనమున కూడ 5 సంవత్సరముల పాటు ఇంద్రునితో కలసి ఆసీనుడైనాడు. స్వర్గలోకసుఖములను అన్నింటిని అనుభవించినాడు. మహావీరుడని పేరు పొందినాడు. సుందర రూపునిగ శ్లాఘింపబడినాడు. ఇహ లోకమున అతడు పొందని విజయముగాని, సౌఖ్యముగాని లేదు. అట్టివాడు 'ఉచ్ఛోషణం' అనగా మిగుల తాపము కలుగ చేయునట్టి 'శోకం' అనగా దుఃఖమును ఏ విధముగా పోగొట్టుకొనవలెనో? తెలియజాలక దీనుడై యుద్ధమున నిలబడి యున్నాడు. ఏది దుఃఖమును పోగొట్టగలదో దానిని తెలియకున్నానని భగవానునితో పలికినాడు.

పదవులు, బాహ్యసంపద, ఆధిపత్యము ఇత్యాదివి, మనుష్యునికి శాంతి నియ్యజాలవనియు, శాంతముగ నుండువానికి మాత్రమే అవి విభూతులుగ యుండుననియు గీత యందలి ఈ శ్లోకము ద్వారా తెలియనగును. హిరణ్యకశిపుడు, రావణుడు, అర్జునుని మించిన పరాక్రమవంతులు. వారు స్వర్గమును కూడ ఆక్రమించినారు. అయినప్పటికిని శాంతి కలుగలేదు.

బహిః కరణములద్వారా ప్రపంచమున సాధించబడునది ఏదియు అంతరంగమున శాంతిని స్థాపించలేదు. కేవలము అంతః కరణ శుద్ధిచే పొందు ఆత్మానుభూతియే శాంతిని, తృప్తిని ఇచ్చును. అంతః తృప్తిలేని వానికి బాహ్యపుష్టి, తుష్టి నియ్యజాలవు. ఈ విషయమున ప్రాచీనులు ఎఱుక కలిగి నిర్మలము, నిరాడంబరము

లగు జీవితము నేర్పరచుకొనినారు. నవీన యుగమున రజోగుణ దోషమున మానవుడు అంతులేని దాహమున పడినాడు. తృప్తిని వదలి తృష్ణతో ఆరాటపడుచు తిరుగాడుచు అమూల్యమైన జీవనమును వ్యర్థము గావించుకొనుచున్నాడు. ప్రాచీనులకన్న తనకెక్కువ తెలుసను గర్వమున పడినాడు. ఎక్కువ తెలిసి జీవితమున తక్కువ సుఖపడుట మరింత మూర్ఖత్వము. భగవద్గీత యందు ఈ శ్లోకమున, శ్లోకము యొక్క నిజస్వరూపము చక్కగ ప్రతిపాదింపబడినది. పరిశుద్ధ జీవనము, నిర్మలమైన మనస్సు, విశాల హృదయము, ఇత్యాది సద్గుణములను సాధించుకున్నవాడు అదృష్టవంతుడు.

# 5

# నిజమైన తెలివి

*శ్రీభగవా నువాచ :*

అశోచ్యా నన్వశోచ స్త్వం ప్రజ్ఞావాదాం శ్చ భాషసే ।
గతాసూ నగతాసూంశ్చ నానుశోచంతి పండితాః ॥ 11

శోకింపదగని విషయములకై శోకించుట, శోకింపదగిన విషయములకై శోకింపకుండుట, జరిగిపోయిన విషయములను గూర్చి ఆలోచించుట, ప్రస్తుతమును మరచుట అను నాలుగు విధములుగా తెలివిగల మానవుడు కూడ తన జీవితమును చిక్కుపరచుకొను చున్నాడు.

నష్టము, తనవారి మరణము, అపజయము, అసౌకర్యము, అపనింద, యిత్యాది విషయములందు తెలివైన మానవుడు కూడ శోకించుట చూచుచున్నాము. భగవానుని దృష్టిలో అవి శోకనీయ మైన అంశములు కానేకావు. కాలము జీవితమున ద్వంద్వముగా సన్నివేశముల నందించుచుండును. కీర్తిని అనుసరించి అపకీర్తి, జయమును అనుసరించి అపజయము, లాభము ననుసరించి నష్టము, సౌకర్యము ననుసరించి అసౌకర్యము, జననము ననుస రించి మరణము వుండుట సృష్టి ధర్మము. వీని గురించి శోకించుట

తగదని గీతావాక్యము. కాలానుగతములై యివి వచ్చి-పోవు చుండును.

శోకింపదగిన ముఖ్య విషయము ఒకటి కలదు. ధర్మము ననుసరించ నపుడు శోకించవలెను. అది రాబోవు శోకములకు కారణము గనుక. అధర్మము నాచరించునపుడు శోకించవలెను. అదియునూ రాబోవు శోకలములకు హేతువు గనుక. వివేకము గల మానవుడు దీక్ష బూనవలసినది ధర్మము ననుసరించుట యందు. మనోవాక్కాయ కర్మలు ధర్మము ననుసరించునపుడు మానవుడు శోకించుటకు తావు లేదు.

ధర్మము కర్తవ్యము రూపమున ఎప్పటికప్పుడు గోచరిస్తూ వుంటుంది. కర్తవ్యము కాలము రూపమున ప్రస్తుతింప బడు చుండును. ప్రస్తుత మందించు కర్తవ్యమును ధర్మముతో ననుస రించుటయేగాని, మరియొక మార్గము యోగజీవనమున లేదు. జరిగిపోయిన విషయములను గూర్చి నెమరువేసుకొని దుఃఖించుట మిక్కిలి అవివేకము.

అర్జుననకు ప్రస్తుత కర్తవ్యము ధర్మయుద్ధము చేయుట. దానిని వదలి, మిథ్యావాదము చేయుట కర్తవ్య విముఖత్వమే. కర్తవ్యమునందు, దైవమునందు, ప్రస్తుతమునందు మేల్కొనమని గీతావాక్యము శాసించు చున్నది. అదియే నిజమైన తెలివి.

# 6

# దివ్యజ్ఞానము

న త్వేవాహం జాతు నాసం న త్వం నేమే జనాధిపాః ।
నచైవ న భవిష్యామ స్సర్వే వయ మతః పరమ్ ॥ 12

దేహినో௨స్మిన్ యథా దేహే కౌమారం యౌవనం జరా ।
తథా దేహాంతరప్రాప్తిః ధీర స్తత్రన ముహ్యతి ॥ 13

ఈ సృష్టియందు ఏ వస్తువుగాని ఒకప్పుడు లేకుండ ఇప్పుడు వుండుట సంభవింపదు. అట్లే ఇప్పుడుండి ఇకముందు ఉండకపోవుట కూడ సంభవింపదు. ఎప్పుడునూ అన్నియును వుండి యున్నవే కాని ఒకప్పుడు లేనివి కావు. ఒకే వస్తువు స్థితి మార్పులు చెందుచున్నప్పుడు ఆ వస్తువునకు అంతకు ముందు స్థితి లేకుండుట. క్రొత్త స్థితి ఏర్పడుట, అదియును మరల మారుట ఒక రసాయనికచర్యగ జరుగుచుండును. ఈ స్థితి మార్పు నిత్యము జరుగు చుండుటచే వుండుట, లేకుండుటగ వస్తువులు గాని, జీవులుగాని కనిపించుచుందురు.

బాలకుడు యువకుడైనపుడు ఇట్టి మార్పే జరుగుచున్నది. బాలకుడు లేకుండుట యువకు డుండుటగ ఒకే జీవుడు

ప్రస్తుతింపబడి యున్నాడు. అటులనే యువకుడు మధ్య వయస్కుడు, వృద్ధుడు అగుట, మరణించుట కూడ గమనించు చున్నాము. మరణించినవాడే మరల పుట్టుచున్నాడని తెలియుటకు సూక్ష్మలోకముల అవగాహనము, దర్శనము కలిగి యుండ వలెను. అది తెలిసినవాడు జీవుడు శాశ్వతుడనియు, సూక్ష్మ స్థూల స్థితులు పొందుచుండుననియు తెలియగలడు. కేవలము స్థూల స్థితులు మాత్రమే తెలిసిన వారికి పూర్ణజ్ఞానము లేక తికమక పడు చుందురు. సూక్ష్మ స్థితులు కూడ తెలిసినవాడే, తెలిసినవాడు. సూక్ష్మస్థితి యందుండుట కూడ తెలిసినవాడు కావున శ్రీకృష్ణుడు స్థూలమున మరణించిన వాడిని సైతము సూక్ష్మ లోకములలో గుర్తించి కొనితెచ్చి తల్లికి, గురువునకు, బ్రాహ్మణునకు, జ్ఞానము నందించినాడు. సూక్ష్మస్థితుల అవగాహనము, దర్శనమే దివ్య జ్ఞానము. యోగము ఆ స్థితుల నందుటకు మార్గము. అట్టి యోగమునకు అధిష్ఠాన దైవము శ్రీకృష్ణుడే. అందుచే అర్జునునకు స్థూల, సూక్ష్మ స్థితులను, జీవులకు జరుగు స్థితి మార్పులను బోధించి యోగమున ప్రవేశపెట్టెను.

# 7

## వచ్చి పోవునవి - ఓర్పు

మాత్రాస్పర్శాస్తు కౌంతేయ శీతోష్ణ సుఖదుఃఖదాః ।
ఆగమాపాయినోఽనిత్యా స్తాం స్తితిక్షస్వ భారత ॥ 14

వెండితెరపై పాత్రధారులు వచ్చిపోవుచుందురు. వివిధము లైన సంభాషణములు వారి నడుమ జరుగుచుండును. సన్నివేశ ములు నిరంతరము సాగుచుండును. సమస్య లేర్పడుచుండును. మరియు పరిష్కరింప బడుచుండును. సుఖపూరితములు, దుఃఖపూరితములు, ఉద్రేకపూరితములు, రాగద్వేషపూరితములు మరెన్నెన్నియో సమస్యలు వచ్చిపోవు చుండును. అనంతముగా పాత్రధారులు వచ్చిపోవుచుందురు. దృశ్యములు వచ్చిపోవు చుండును. సన్నివేశములు వచ్చిపోవుచుందురు.

వెండితెరపై వచ్చిపోవుచున్న సమస్త దృశ్యములకు వెండి తెరయే ఆధారము. ఎన్ని విషయములు వచ్చిపోవుచున్నను వెండి తెర వెండితెరగానే యుండునుగాని, స్థితి మార్పు చెందదు. పౌరాణికము, సాంఘికము, జానపదము అగు ఎన్ని చిత్రములు తెరపై ప్రదర్శింపబడినను, వాని వాసన లేక ప్రభావము వెండితెర కుండదు. సినిమాహాలులోని వెండితెర వంటిదే సృష్టిలోని చైతన్యము.

చైతన్యము ఆధారముగా లోకములు, లోకులు ఏర్పడు దురు. వారి నడుమ సన్నివేశములు కాలము రూపమున ఏర్పడు చుండును.ఇందేదియు చైతన్యము నంటదు. సృష్టిలోని ఈ చైతన్యమునే దైవమందురు. దాని నాశ్రయించుటచేత జీవులు కూడ సమస్యల కతీతముగ ప్రశాంతముగ జీవించనగును. దాని నాశ్రయించుటకే వివిధ మార్గములు.

సృష్టియందలి ఈ చైతన్యము త్రిగుణాత్మకముగ ఏర్పడి నపుడు లోకములు, లోకులు, సన్నివేశ ములు ఏర్పడును. అనగా సినిమా యుండును. శుద్ధచైతన్యముగా నున్నపుడు సినిమా లేక వెండితెర యుండును. సినిమా వేయబడు నపుడు కూడ వెండితెర ఉన్నప్పటికి అందలి సన్నివేశములను, సమస్యలను చూచువారికి వెండితెర మరపునకు వచ్చును. వెండి తెర గుర్తున్నవారికి సన్నివేశము లన్నియు వచ్చిపోవునవివలె కనుపించును. సుఖము - దుఃఖము; సౌకర్యము- అసౌకర్యము; లాభము-నష్టము; ధనము-పేదరికము; జననము-మరణము; రాత్రి-పగలు మొదలగున వన్నియు వచ్చిపోవునవియే. శ్రీకృష్ణుడు అట్టి చైతన్య స్వరూపుడు కనుక ఈ సృష్టి యందలి సమస్తము వచ్చిపోవునవియే అనియు, "నేను" అను చైతన్యము శాశ్వత మనియు, అట్టి శాశ్వత ప్రజ్ఞ యందు నిలబడిన వానికి మొత్తము సృష్టి అంతయు ఒక సినిమా కథవలె ఆనందము నందించు ననియు బోధించెను. అనిత్యములు మరియు వచ్చిపోవు విషయముల యందు ఓర్పు వహించమని బోధించెను.

ఓర్పుగల వానికి సమస్తము అధీనమున నుండును. ఓర్పు

లేనివాడు దుఃఖపడును. సృష్టి యందలి సమస్త విజయములకును ఓర్పు ప్రధానమని భగవానుడు బోధించెను. "తితిక్షస్వ భారత" ఓ భారతీయుడా! ఓర్పు వహించుము! అని గీత నిర్దేశించుచున్నది. ఓర్పుతో తాను చైతన్య స్వరూపుడనని మరల మరల గుర్తు తెచ్చుకొనవలెను. అట్లు గుర్తు తెచ్చుకొనుట వలన జీవితము నందలి సమస్తమైన సన్నివేశములు వచ్చిపోవునవియే అని తెలియ గలదు. ఈ అభ్యాసము వలననే ఎవనికైనను తెలియుట యుండునుగాని, చదువుట, వినుట వలన మాత్రము కాదు. ఓర్పును మించిన గుణము లేదని, దానిని ముందు పొందుమని గీతోపనిషత్తు ప్రప్రథమముగా బోధించుచున్నది.

ఓర్పు వలననే శ్రీరాముడు, ధర్మరాజు, హరిశ్చంద్రుడు, నలుడు ఇత్యాది దివ్యాంశ సంభూతులు లోకము లన్నిటిని జయించగల్గిరి. ఓర్పు మనిషిని మహాత్మునిగ మార్చు ఉత్ప్రేరకము. ఎన్ని సద్గుణము లున్నప్పటికిని ఓర్పు లేనిచో అవి రాణించవు.

## 8

# అమృతత్వము - అర్హత

**యం హి న వ్యథయన్త్యేతే పురుషం పురుషర్షభ ।**
**సమదుఃఖ సుఖం ధీరం సోఽమృతత్వాయ కల్పతే ॥ 15**

వ్యథ చెందని మనసు కలవాడు అమృతత్వ స్థితిని పొందుటకు అర్హుడని గీత బోధించుచున్నది. త్రిగుణాత్మకమైన సృష్టియందు అవస్థితి చెందినటువంటి మానవ ప్రజ్ఞకు వ్యథ సహజము. ప్రతి మానవుడు సహజముగ వజ్రచైతన్యవంతుడై ఉన్నప్పటికీ చైతన్యము త్రిగుణముల యందు బంధింపబడి నప్పుడు వ్యథ కవకాశమేర్పడును. మరికొంత అవస్థితి చెంది ఇంద్రియముల యందు అనగా ఇంద్రియార్థముల ననుసరించు స్థితియందు బంధింపబడినపుడు అట్టివ్యథ తీవ్రత చెందును. సత్యవంతుడైన మానవ ప్రజ్ఞ మేల్కాంచగనే చైతన్యవంతునిగ ఏర్పడును. చైతన్యవంతమైన మానవప్రజ్ఞ త్రిగుణములలోనికి, ఇంద్రియముల లోనికి ప్రవేశించుట తప్పనిసరి. అట్టి ప్రవేశమున తన సహజ స్థితిని మరచినచో మాయ ఆవరణమున చిక్కును. అనగా ప్రజ్ఞ త్రిగుణాత్మక మగును. త్రిగుణాత్మక మగు తన

ప్రజ్ఞను త్రిగుణములకు అతీతముగ కూడ అభ్యాసవశమున స్థిరపరచుకొన వచ్చును.

త్రిగుణములలోనికి మరియు ఇంద్రియములలోనికి అవతరణము చెందుచున్న చైతన్యము తన సహజ స్థితిని కోల్పోనవసరము లేదు. సూర్యుని కిరణము గ్రహగోళాదులను చేరునపుడు సూర్యుని వదలి, గ్రహములను చేరుటలేదు కదా! సూర్యకిరణము వ్యాపనము చెందుచున్నట్లుగ మనకు తెలియును. కిరణము సూర్యుని యొద్దనూ ఉన్నది. మరియు ఏడు గోళముల వద్దకూ ఏక కాలమున చేరుచున్నది. అట్లే మానవచైతన్యము కూడ ఏకకాలమున సప్తకోశములనూ వ్యాపించి యుండ గలదు. అట్టి వ్యాపనమును అభ్యాసము చేయు పురుషుడు శ్రేష్ఠుడు. మోక్షమునకు అర్హత కలిగి యున్నవాడు. మోక్షమునందు సహజ ముగ నున్నవాడు. పురుషుడు అను పదమును ఉపయోగించుటలో భగవానుని యొక్క రహస్య సూచన కూడ ఒకటి ఇక్కడ గమనింప దగి యున్నది. ఏడంతస్తుల పురమున ప్రవేశించి, ఏడంతస్తులనూ వ్యాపించియున్న ప్రజ్ఞవు నీవు సుమా! అని తెలుపుటకే "పురుషమ్", "పురుషర్షభ" అని పలికినాడు.

జీవిమున వ్యథ చెందువారు తమ్ము తాము మరచిన వారనియు, సత్యాన్వేషణమున ఓర్పు వహించి తనను తాను గుర్తుకు తెచ్చుకొనుచు వ్యథ చెందక జీవించువారే అమృతత్త్వము నకు తగిన వారనియు గీతోపనిషత్తు బోధించుచున్నది.

## 9

# ఉన్నది పోదు - లేనిది రాదు

నాసతో విద్యతే భావో నాభావో విద్యతే సతః ।
ఉభయోరపి దృష్టోఽంత స్త్వనయో స్తత్త్వదర్శిభిః ॥ 16

అవినాశి తు తద్విద్ధి యేన సర్వ మిదం తతమ్ ।
వినాశ మవ్యయ స్యాస్య న కశ్చి త్కర్తు మర్హతి ॥ 17

సృష్టిలో లేనిది భావమునకే రాదు. ఉన్నది భావమునకు రాకపోదు. అందుకే చమత్కారముగా "సృష్టిలో లేనిదంటూ లేదు" అని అంటారు. లేనిది భావనకే రాదు. భావనలోకి వచ్చినది ఉండకుండా పోదు. అందుకే దైవము లేడనుట తెలివి తక్కువ. లేనిచో భావమునం దెట్లేర్పడును? లేనిది భావమునకు రాదు కదా ! ఉన్నది మనకి కనపడనప్పుడు లేదందుము. మనకు కనపడనిది లేదనుట పసితనము. దయ్యములు ఉన్నవా? అను ప్రశ్న వచ్చినపుడు కూడా సమాధాన మిదియే. లేనిది భావించము కదా! మనకు తెలిసిన విషయము లన్నియు ఉన్నవియే. కానిచో కొందరికి ఉండవచ్చు. కొందరికి ఉండకపోవచ్చు. ఉండుట, లేకుండుట, గ్రహించువాని స్థితిని బట్టి ఉండును. కొందరికి సూక్ష్మ లోకములున్నవి. వాని అనుభూతి కూడ ఉన్నది. కొందరికి లేదు.

అనుభూతి లేనివారు లేవందురు. అనుభూతి కలుగనంత వరకు లేదన్నది వారికి సత్యము కాని, శాశ్వత సత్యము కాదు.

అటులనే ఏదియైనను ఒకప్పుడుండుట, మరియొకప్పుడు ఉండ కుండుట ఉండదు. మన తాత ముత్తాతలు, మన ముందు తరముల వారు, ముందు యుగములవారు ఉన్నారా అను ప్రశ్నకు సమాధానము ఉన్నారనియే! ఉండుట కేవలము భౌతికము కాదని తెలియవలెను. సృష్టి యందలి ప్రతివస్తువూ స్థూలముగగాని, సూక్ష్మముగగాని శాశ్వతముగ ఉండి యుండును. స్థూలముగ అగుపించినపుడు ఉన్నదనుకొనుట, అగుపించనపుడు లేదను కొనుట అవివేకము. దశరథుని అంత్యక్రియల అనంతరము ఇపుడు దశరథుడు లేడు కదా! కావున రాజ్యము చేపట్టుము అని పలికిన మంత్రి జాబాలికి రాముడు ఇచ్చిన సమాధానము ఈ సూత్రము ననుసరించియే యుండును.

నిజమునకు సృష్టియందు పుట్టునది, పోవునది ఏమియు లేదు. స్థూలముగ అగుపించినపుడు పుట్టినదందుము, సూక్ష్మస్థితి చెందినపుడు పోయినదందుము. ఇది పరిమితమైన అవగాహనము. ప్రళయమున కూడ లోకములు, లోకేశులు, లోకస్థులు బీజప్రాయ ముగ నుండి సృష్టి ఆరంభమున దివ్య సంకల్పము నుండి మరల పూర్వ పద్ధతినే దిగివచ్చుచుందురు. కావున ఉన్నది లేకపోలేదు. లేనిది ఎప్పటికినీ లేదు. జీవుల ప్రళయమున దైవము నందుండు టయే ఉండునుగాని, కరగిపోవుట, కలయుట లేదు. అట్లగు పించును. అందువలన తెలిసినవారు ఈ సమస్తమును ఎప్పుడునూ ఉన్నదిగను, శాశ్వతముగను భావింతురు. కాలచక్రమున సూక్ష్మము

నుండి స్థూలమునకు, స్థూలము నుండి సూక్ష్మమునకు వచ్చిపోవు చుండును గాని, అసలు లేకుండుట ఉండదని వారి జ్ఞానము. గ్రహమునకు గ్రహమునకూ మధ్య గల చోటు యందు ఏమియు లేదని ఇటీవలి వరకు శాస్త్రజ్ఞులు అనుచుండిరి. అది అంతయు దైవముతో నిండియున్నదని ఆత్మజ్ఞానులు తెలుపుదురు. ఈ శతాబ్దమున చోటంతయూ శూన్యము కాదని, పూర్ణమని శాస్త్రజ్ఞులు తెలుసుకొనుచున్నారు. అటులనే సూక్ష్మ లోకముల వికాసము లేనివారు, దివ్య శరీరధారులైన మహర్షులు, పరమ గురువులు, దేవతలు లేరనుచుందురు. క్రమ వికాసమున వీరందరు ఉన్నారని ఒప్పుకొనక తప్పదు.

పదార్థమయ ప్రపంచము కూడ లేకపోవుట లేదని గమనించవలెను. వేదాంతులు పదార్థమును, పరమార్థమును రెండు విషయములుగ తెలుపుచు ఒకటి నిరాకరించి, రెండవ దానిని ఆదరింతురు. నిజమునకు అవి రెండును ఒకటియే! పరమార్థము స్థూలస్థితి చెందినపుడు పదార్థమగును. పదార్థము సూక్ష్మత చెందినపుడు పరమార్థ మగును. ఒకటియే స్థితి భేదముచే రెండుగా అగుపించునుగాని రెండు లేవు. మంచు గడ్డ అగుచున్నది మరల నీరగు చున్నది అని తెలియవలెను.

గీతోపనిషత్తునందు స్థాపింపబడిన అత్యంత ప్రధానమైన మూల సూత్రములలో ఈ సూత్ర మొకటి. ఈ సూత్రమును గూర్చి బాగుగ ధ్యానము చేయవలసిన అవసరము విద్యార్థులకు కలదు.

## 10

# మార్పు - మహత్మ్యం

అంతవంత ఇమే దేహా నిత్య స్యోక్తా శ్శరీరిణః ।
అనాశినోఽప్రమేయస్య తస్మా ద్యుధ్యస్వ భారత ॥ 18

య ఏనం వేత్తి హంతారం యశ్చైనం మన్యతే హతమ్ ।
ఉభౌ తౌ న విజానీతో నాయం హంతి న హన్యతే ॥ 19

న జాయతే మ్రియతే వా కదాచి
న్నాయం భూత్వా భవితా వా న భూయః ।
అజో నిత్య శ్శాశ్వతోఽయం పురాణో
న హన్యతే హన్యమానే శరీరే ॥ 20

వేదావినాశినం నిత్యం య ఏన మజ మవ్యయమ్ ।
కథం స పురుషం పార్థ కం ఘాతయతి హంతి కమ్ ॥ 21

ఈ సృష్టి మొత్తమును పరిశీలించి చూచినచో సమస్తమును మార్పు చెందుచున్నట్లు గోచరించును. మార్పు చెందు ఈ సమస్తమునకు మార్పు చెందని ఒక కేంద్రము కలదు. అది మార్పు చెందువానిలో మార్పు చెందక యుండును. అది ఆధారముగా సమస్తమును ఉద్భవించి, వృద్ధిపొంది, లయమగు చున్నది.

ఉద్భవము, వృద్ధి, లయము, మరల ఉద్భవము, అనంతముగ సాగుచుండును. లయమైనపుడు వృద్ధిపొందిన విషయము సూక్ష్మమై ఈ కేంద్రమునందు యిమిడియుండును. మరల కాలము ననుసరించి ఉద్భవించుట, వృద్ధిపొందుట జరుగుచున్నది. ఉదాహరణకు మనలో బాల్యము నుండి వృద్ధాప్యము వరకు అనుదినము మార్పులు జరుగుచునే యున్నప్పటికీ దైనందినముగ ఆ మార్పులను మనము గమనించము. కారణమేమన సహజముగా మార్పు చెందని ఆ కేంద్ర ప్రజ్ఞయే మనము. మనమాధారముగా అనేక భావములు కలిగినవి. ఆ భావములు మార్పుకూడ చెందినవి. భాషణములు కూడ అట్లే! ఎన్నెన్నో భావములు, భాషణములు, చేతలు, వాటియందు ఎన్నెన్నో మార్పులు! ఇన్నిటి యందు "నేనున్నా"నను ప్రజ్ఞకు ఏ మార్పూలేదు.

ఈ ప్రజ్ఞ గుణాతీతము, కాలాతీతము కూడ! దీనినుండి సమస్త భావములు, కాలానుసారముగ వృద్ధి చెంది, ప్రవర్తించి, ఈ నేనను ప్రజ్ఞలో మరల కలియుచున్నవి. ఈ ప్రజ్ఞనే ఆత్మ యందురు. అది నిత్యముగను, నాశరహితముగను, కొలతలకు అతీతముగను, జనన మరణముల కతీతముగను ఉండును. ఉండుటయే దీని సహజ లక్షణము. దీనినుండి పుట్టిన వాటికి చంపుట, చచ్చుట ఇత్యాది లక్షణము లుండును. ఇది మాత్రము శాశ్వతముగ నుండును. కావుననే భీష్మాదులు మరణించినను, మరణించుట అనగా ఆ మరణము వారి దేహములకు, భావములకే గాని, వారికి కాదని, వారింతకు ముందు కలరని, ఇక ముందును ఉందురని భగవానుడు తెలిపెను. వారిని దేహము

లుగా కాక దేహులుగా అనగా దేహములను ధరించినవారిగా చూడుమని జ్ఞానదృష్టి కల్పించబూనెను.

దేహములు నిత్యము కావనియు, దేహులు నిత్యులనియు, చంపకుండినను దేహములు కాలక్రమ మున మరణించుననియు, అట్టి దేహములు ధర్మ యుద్ధమున మరణించుటచే అందలి ప్రజ్ఞలకు ఉత్తమ సంస్కారములు కలుగుననియు, కావున యుద్ధము చేయుమనియు భగవానుడు బోధించినాడు.

ఇందొక మహోపదేశము కలదు. "దేహి నిత్యుడు కావున దేహమును ధర్మాచరణమునకై వినియోగించుచు, అట్టి ఆచరణ మున వలసినచో మరణించుటకైనను మానవుడు వెనుతీయ రాదని" ఉపదేశము. ధర్మము ఎటు పోయినను మనము ఉండవలె ననుకొనుట కాక, మనకేమైనను ధర్మము నిలబెట్టుట గీత ప్రతిపాదించు ముఖ్యమైన సూత్రము.

# 11

# యోగవిద్య - అభ్యాసము

వాసాంసి జీర్ణాని యథా విహాయ
నవాని గృహ్ణాతి నరోఽపరాణి ।
తథా శరీరాణి విహాయ జీర్ణా
న్యన్యాని సంయాతి నవాని దేహీ ॥ 22

చినిగిన, చివికిన బట్టలను విడచి, క్రొత్త బట్టలు వేసు కొనుట బుద్ధి. వాటినే సర్దుబాటు చేసుకొనుట లోభత్వము. అది మోహము నుండి జనించును. శరీరములు కూడ వస్త్రముల వలె చివుకుట, చినుగుట జరుగును. అప్పుడు వానిని వదలి క్రొత్తవి ధరించుటకు సంసిద్ధత కావలెను. అది జ్ఞానము వలన కలుగును. తాను శరీరము కాదని, శరీరము తాను ధరించిన వస్త్రమని, ధర్మముతో కూడిన అర్థకామములను తా ననుభవించు టకు ప్రకృతిచే ఈయబడిన వాహనమని, చినిగినచో మరియొక క్రొత్త వస్త్రము ప్రకృతి ఇచ్చునని తెలియుటయే ఈ జ్ఞానము.

వస్త్రములు మార్చినవాడు తాను మారుచున్నానని అను కొనుట లేదు. పూర్వవస్త్రములలో తా నెట్లుండెనో తనకు జ్ఞప్తి యున్నది. అటులనే దేహములు మార్చినను, అంతకు ముందు

దేహములో తా నెట్లుండెనో తెలియు విద్య కలదు, అది యోగవిద్య. అది తెలిసినవారు దేహములను మార్చుట వస్త్రములను మార్చు నంత సులభముగా చేయుదురు. ఈ విద్య కోల్పోవుటచే బికారుల వలె చివికినవి, చిరిగినవి అయిన వస్త్రములను పట్టుకొని అజ్ఞాన మున జీవులు వ్రేలాడుచున్నారని గీత ఘోషించుచున్నది. పాత బట్టలు వదలవలె నన్నచో క్రొత్త బట్టలున్నవను దృఢ విశ్వాస మేర్పడవలెను కదా! అట్లేర్పడుటకు నిర్దిష్టమైన, క్రమబద్ధమైన అభ్యాసము కలదు. అదియే యోగ విద్యాభ్యాసము. అట్టి విద్యను బోధించు యోగ శాస్త్రమే గీత.

# 12

## ఆత్మ

నైనం ఛిందంతి శస్త్రాణి నైనం దహతి పావకః ।
న చైనం క్లేదయంత్యాపో న శోషయతి మారుతః ॥ 23

అచ్ఛేద్యో౽య మదాహ్యోయ మక్లేద్యో౽శోష్య ఏవ చ ।
నిత్య స్సర్వగత స్థాణు రచలో౽యం సనాతనః ॥ 24

అవ్యక్తో-య మచింత్యో౽య మవికార్యో౽య ముచ్యతే ।
తస్మా దేవం విదిత్వైనం నానుశోచితు మర్హసి ॥ 25

ఆత్మతత్వము నెఱిగిన వారికే ఆత్మను గూర్చి పూర్ణమైన అవగాహన యుండును. ఎఱుగుట యనగా అనుభవ పూర్వకముగా నెఱుగుట. బోధనా పూర్వకముగ కాదు. బోధనా పూర్వకముగ ఆత్మను గూర్చి తెలుపుట కేవలము సమాచారము నందించుటయే.

ఆత్మ దర్శనమునకు నిర్దిష్టమైన సాధనా మార్గము కలదు. అదియే యోగవిద్య. అట్టి యోగవిద్యను ప్రతిపాదించు ప్రపంచ గ్రంథము భగవద్గీత యొక్కటియే!

ఆత్మ స్వరూపుడైన శ్రీ కృష్ణ భగవానుడు రెండవ అధ్యాయమున ఆత్మతత్త్వమును ప్రతిపాదించినాడు. అటుపైన ఆత్మదర్శనము జరుగుటకు వలసిన సోపానము లేర్పరచినాడు. ఆచరణ పూర్వకముగా భగవద్గీతను అందించటం జరిగింది. అనుసరించుటయే సజ్జనుని కర్తవ్యము.

"ఆత్మ" ఆయుధముచే ఛేదింపబడనిది. అగ్నిచే దహించ బడనిది. నీటిచే తడుప బడనిది. గాలిచే ఎండిప బడజాలదు. ఆత్మ నిత్యము. అంతటా వ్యాపించి యున్నది. స్థిరమైనది. చలనము లేనిది. తుది, మొదలు లేనిది.

"ఆత్మ" ఇంద్రియములకు గోచరము కాదు. మనస్సుచే చింతింప శక్యము కాదు. ఇట్లు ఆత్మను గూర్చి వివరించినపుడు పాఠకునకు అది సమాచారమే గాని, అనుభవపూర్వకము కాదు. దానిని అనుభూతి చెందుటకే "భగవద్గీత" యను యోగ శాస్త్రమును భగవానుడే జాతి కందించినాడు. ఆచరణమే దీనికి ప్రధాన సూత్రము.

## 13

# ఆత్మ - అద్భుతము - ఆశ్చర్యము

ఆశ్చర్యవ త్పశ్యతి కశ్చి దేన
మాశ్చర్యవ ద్వదతి తథైవ చాన్యః ।
ఆశ్చర్యవ చ్చైన మన్య శ్శృణోతి
శ్రుత్వా ప్యేనం వేద నచైవ కశ్చిత్ ॥ 29

ఆత్మను గూర్చి చెప్పుచున్ననూ, వినుచున్ననూ, చదువుచున్ననూ, అట్లెన్నిసార్లు ఒనర్చిననూ ఆత్మానుభవము కలుగదు. ఆచరణ పూర్వక మైనచో అనుభూతమై పూర్ణముగ తెలియును. లేనిచో గాలిని మూట కట్టుకొనినట్లు ఎప్పటికప్పుడు దానిని గూర్చిన భ్రాంతియే మిగులును. సృష్టియందు అన్నిటికన్నా అద్భుతమైనది, ఆశ్చర్యకరమైనది 'ఆత్మ' యొక్కటియే!

ఇంద్రియ నిగ్రహము, బాహ్య విషయములయెడ నైరాశ్యము మరియు వైరాగ్యము, చిత్త నైర్మల్యము, అంతర్ముఖ తపస్సు సాధించిన ధీరునికే ఆత్మదర్శనము కలుగును. అట్టివాడు దుర్లభుడు.

# 14

## అశోకత్వము

దేహీ నిత్య మవధ్యోఽయం దేహే సర్వస్య భారత ।
తస్మా త్సర్వాణి భూతాని న త్వం శోచితు మర్హసి ॥ 30

అవ్యక్తముగ నున్నది వ్యక్తమైనపుడు పుట్టినదనుకొనుట, వ్యక్తమైనది అవ్యక్తమును జేరునపుడు చచ్చిన దనుకొనుట అజ్ఞానము. సృష్టి సమస్తమూ ఒక దిశగా వ్యక్తమగుచుండగా, మరియొక దిశగా అవ్యక్తమును చేరుచూ మరల వ్యక్తమగు చుండును. వ్యక్తము కానపుడు సూత్రప్రాయముగను, వ్యక్తమగు నపుడు రూపాత్మకముగను ఒకే తత్త్వము నిలచియున్నది. చోటు లోని కనపడని నీరు వర్షమైనప్పుడు వ్యక్తముగను, భూమికి చేరి ప్రవహించునపుడు 'నది' యగును. ఉత్తర దక్షిణ ధృవములందు కఠినమైన మంచుగడ్డ యగును. సూర్యరశ్మిచే మరల క్రమశః చోటును చేరును. మరల అవ్యక్త మగును. కాలక్రమమున మరల వర్షముగ వ్యక్తమగును.

సృష్టిలోని సమస్త వస్తువులూ అట్టివే. వ్యక్తావ్యక్తముగ చక్ర

భ్రమణమున అగుపించుచూ అదృశ్యమగుచూ, నిరంతరమూ వుండును. ఈ ధర్మమును తెలిసినవాడు దేనికిని శోకింపడు. అతనికి జననము - మరణము అనునవి మిథ్యా పదములే. కనుక జీవుల పుట్టుకయం దుత్సాహము, మరణమునందు దుఃఖము వానికి కలుగవు. పుట్టునవి - చచ్చునవి అని ఏమియూ లేవు. శాశ్వత దర్శన మొక్కటే యుండును. దానియందతడు ఉపస్థితుడై యుండును. ఇట్టి దర్శనము మాత్రమే సమస్త శోకముల నుండి జీవుని తరింపజేయగలదని 'గీతోపనిషత్తు' బోధించుచున్నది.

# 15

# ధర్మము

అథ చేత్త్వ మిమం ధర్మ్యం సంగ్రామం న కరిష్యసి ।
తతః స్వధర్మం కీర్తిం చ హిత్వా పాప మవాప్స్యసి ॥ 33

అకీర్తిం చాపి భూతాని కథయిష్యంతి తేఽవ్యయామ్ ।
సంభావితస్య చాకీర్తి ర్మరణా దతిరిచ్యతే ॥ 34

భయాద్రణా దుపరతం మన్యంతే త్వాం మహారథాః ।
యేషాం చ త్వం బహుమతో భూత్వా యాస్యసి లాఘవమ్ ॥35

అవాచ్యవాదాంశ్చ బహూన్ వదిష్యంతి తవాహితాః ।
నిందంత స్తవ సామర్థ్యం తతో దుఃఖతరం ను కిమ్ ॥ 36

హతో వా ప్రాప్స్యసి స్వర్గం జిత్వా వా భోక్ష్యసే మహీమ్ ।
తస్మా దుత్తిష్ఠ కౌంతేయ యుద్ధాయ కృతనిశ్చయః ॥ 37

ఈ ప్రపంచమున నిరపాయముగ జీవించుటకు, నశింప కుండుటకు ధర్మ మొక్కటే పట్టుకొమ్మ. భారతీయ వాఙ్మయము సమస్తమునూ ధర్మాచరణనే బోధించును. గీతోపనిషత్తుకూడా ధర్మపరిపాలనముననే పరిపూర్ణముగ సమర్థించును. ఎవరి ధర్మము వారు పరిపాలించినపుడు సంఘము సుభిక్షమగును.

'కలి' ప్రభావమున ప్రతియొక్కరు స్వధర్మమును నిర్లక్ష్యము చేయుట జరుగుచున్నది. ఎవరు ఏ పనినైననూ చేయవచ్చునను అవగాహన కలిప్రభావమే. కుక్క పని గాడిద చేయరాదు. గాడిద పని గుఱ్ఱము చేయరాదు. ఏనుగు పని ఎలుక చేయరాదు. ఆవు పని పిల్లి చేయరాదు - అని ఎవరునూ తెలుపనక్కరలేదు కదా! అట్లే క్షత్రియుడు బ్రాహ్మణుని పని, బ్రాహ్మణుడు వైశ్యుల పని, వైశ్యులు క్షత్రియుల పని యిట్లు కలగాపులకముగా అందరునూ అన్ని పనులూ చేయుట ధర్మమును వెక్కిరించుటయే.

అర్జునుడు క్షత్రియుడగుట వలన ధర్మ రక్షణకై యుద్ధము చేయుట అతని కర్తవ్యము. వేదాంతివలె తత్త్వమును పలుకుట అసమంజసము. అతని తత్త్వము కూడా మిడిమిడి జ్ఞానమే. తాను చేయవలసిన పని చేయుటకు అసౌకర్యముగ నుండుట వలన మరియొక మార్గమును చూసుకొనువాడు, అపకీర్తి పాలగు టయేగాక, పాపమును పొంది నశింపగలడు. ధర్మ ప్రవర్తనమున మరణించిననూ, జయించి బ్రతికిననూ అట్టి జీవుడు ముక్తుడై యుండును. అధర్మమును ఆచరించువాడు, ఆచరించుచూ జీవించువాడు శవము కన్నా హీనమని ధర్మము బోధించుచున్నది. ధర్మాచరణమున మరణించిననూ తనకిష్టమే ననియు, అధర్మా చరణమున జీవించుట హేయమనియు నిష్కర్షగ గీతోపనిషత్తు బోధించుచున్నది.

## 16

# భయము - భద్రత

నేహాభిక్రమనాశోఽస్తి ప్రత్యవాయో న విద్యతే ।
స్వల్ప మప్యస్య ధర్మస్య త్రాయతే మహతో భయాత్ ॥ 40

మానవ జీవితమున ప్రస్తుత కాలమున భద్రత లోపించినది. భయ మావరించినది. ప్రాథమిక విద్య నేర్చు పసివాని నుండి పరిపాలనము చేయు పరిపాలకుని వరకూ ఎవరును నిర్భీతిగా జీవించుట లేదు. పిల్లలకు చదువు భయము, యువకులకు వృత్తి - ఉద్యోగ భయము, మధ్య వయస్కులకు అభివృద్ధిని గూర్చి భయము, అధికారులకు పదవీ భయము, ధనకాముకులకు ధన భయము, కీర్తి కాముకులకు అపకీర్తి భయము, అందరికీ అనారోగ్య భయము, జీవితమంతా భయం భయం. ఇవికాక, హత్యలు, మారణ హోమాలు, అభద్రత, వివిధమగు ప్రమాదాలు, యిన్నిటి యందు దినమొక గండముగ జీవితము సాగుచున్నది.

నిస్సహాయుడైన మానవుడు కలియుగము కదాయని, సమస్తమును సరిపెట్టుకొనుచున్నాడు. భౌగోళికముగా యిప్పుడు భూమికి చక్రవర్తి భయమను పిశాచమే. అది కారణముగా భద్రత

ఎండమావిగ భావించబడుతూ యున్నది. కానీ, భద్రపథమును భగవద్గీత సూక్ష్మముగ తెలిపియున్నది. ఆ పథము శాశ్వతముగా భయమును నివారించును. ఎంత స్వల్పమైననూ, అతి చిన్న దైననూ ఏదో నొక ధర్మమును దైనందినముగ ఆచరించిన జీవునకు ఎంత పెద్ద భయమైననూ నివారణమగును. నిరంతరత్వము, శ్రద్ధాభక్తులు, ఒక ధర్మము ననుసరించుటలో పాటించిన జీవునకు సమస్త భయమూ పటాపంచలగును. కలియుగము కటిక చీకటి వంటిది. కటిక చీకటిలో చిన్న దీపము కూడా చక్కని వెలుగునిచ్చి దారి చూపును. అట్లే నిరంతరమూ నిర్వర్తింపబడుచున్న చిన్న ధర్మము ఎంతపెద్ద భయమునుండైనా రక్షించగలదు.

"స్వల్పమపి అస్య ధర్మస్య త్రాయతే మహతో భయాత్" అని భగవానుడు వాగ్దానము చేసెను. దీనిని విశ్వసించి ధర్మమాచ రించు జీవునకు భయపడుటకు తావుండదు. భయంకరమగు భయమును అతి స్వల్పమైన ధర్మాచరణ మాలంబనముగా దాటుడు. ఇట్లు మార్గమును సుభద్రము చేసుకొనుడు.

## 17

# వ్యవసాయము

వ్యవసాయాత్మికా బుద్ధి రేకేహ కురునందన ।
బహుశాఖా హ్యనంతాశ్చ బుద్ధయోఽవ్యవసాయినామ్ ॥ 41

భారతదేశమున పండితులెందరో కలరు. చాలామందికి చాలా విషయములు తెలియును. వేదాంతము మొదలుకొని నీతికథల వరకును అందరూ అన్నియూ చెప్పగలరు. బోధకులకు, గురువులకు, మహాత్ములకు లోటులేని పుణ్యభూమి. సనాతనమైన దేవాలయములు, ఆధ్యాత్మికతను పెంపొందించు ఆశ్రమములు లెక్కకు మిక్కుటములు. అన్ని సమస్యలకూ పరిష్కారములు తెలుపగలిగిన మేధాసంపత్తి తగుమాత్రము గలదు.

ఇంత జ్ఞానము కలిగియున్ననూ భరతజాతి యింతటి దుస్థితి యందు వుండుటకు కారణమేమి? పేదరికము, అనాగరికత, దురాచారము యింత విజృంభణము చేయుటకు కారణమేమి? భారతదేశమున రాణించలేని భారతీయులు, విదేశములలో రాణించుటకు కారణమేమి?

ఇన్నింటికీ కారణ మొక్కటియే. మనకు చాలా విషయములు తెలియును. కాని, వాటిని ఆచరించు స్ఫూర్తి లేదు. అన్నమెట్లు వండుకొని తినవలెనో బాగుగ తెలిసి, వండుకొనుటకు బద్ధకించు జాడ్యము జాతిని పీడించుచున్నది. ఆచరణ శూన్యతయే కారణముగ సమస్త జ్ఞానము అక్కరకు రాకుండ యున్నది. వ్యవసాయము తెలిసియూ చేయని రైతునకు ధాన్యమెట్లు లభింపదో, తెలిసిన విషయము లాచరించని వానికి నిష్కృతి లేదు. బుద్ధిని పరిపరి విధములుగ పోనీయక తెలిసిన విషయములందు నిర్దిష్టముగ నియమించి ఆచరించమని గీతోపనిషత్తు నిర్దేశించు చున్నది. ఈ సూత్ర మంగీకరింపని వానికి జీవితము ఒక ఎడారి!

# 18

# అనర్హుడు

భోగైశ్వర్య ప్రసక్తానాం తయాఽపహృతచేతసామ్ ।
వ్యవసాయాత్మికా బుద్ధి స్సమాధౌ న విధీయతే ॥ 44

భగవంతుడు రస స్వరూపుడు. రసాస్వాదనము చేయుటకే జీవనము. అదియే వైభవము. అట్టి వైభవమును పొందుటకు ఈ క్రిందివా రనర్హులని భగవానుడు బోధించుచున్నాడు.

1) కర్మఫలములం దాసక్తి గలవాడు,
2) పుణ్యము కొరకు మంచిపని చేయువాడు,
3) కోరికలతో నిండిన మనస్సు కలవాడు,
4) భోగములయం దాసక్తి కలవాడు,
5) జ్ఞాన సముపార్జన చేయనివాడు,
6) ఐశ్వర్యములను సంపాదించుటకు ప్రయాస పడువాడు,
7) తెలిసినదానిని ఆచరించనివాడు-

పైవారందరూ వారి మనస్సుచే మోసగింపబడినవారు. వారు దైవ ధ్యానమును చేయలేరు. రసానుభూతిని పొందలేరు.

## 19

# తుదిమెట్టు

త్రైగుణ్యవిషయా వేదా నిస్త్రైగుణ్యో భవార్జున ।
నిర్ద్వంద్వో నిత్యసత్త్వస్థో నిర్యోగక్షేమ ఆత్మవాన్ ॥ 45

మానవ జీవితము త్రిగుణములతో అల్లబడి నిర్వర్తింప బడుచున్నది. కొంత తడవు రజోగుణము పనిచేయుచుండగ విజృంభించి పనిచేయుట యుండును. అటుపైన తమోగుణ మావరించి కాళ్ళు బారజాపుకొని యుండుట, అనారోగ్యము పొందుట, విశ్రాంతిని కోరుట యుండును. చేయుట, చేయకపోవుట అను రెండు స్తంభముల మధ్య తిరుగాడుచూ జీవుడు క్షణ కాలము, రెండు గుణములను తనయం దిముడ్చుకొను సత్వగుణమును అతిస్వల్పముగ రుచిగొనును. సత్వగుణ రుచి నిజమైన ఆనంద మును కలిగించి అట్టి ఆనందము కొరకై అన్వేషించుట జరుగు చుండును. ఈ అన్వేషణముననే కాలము వ్యయ మగుచుండును.

రజస్సు, తమస్సు అనెడి గుణములు మనస్సున ద్వంద్వము లున్నంతకాలము జీవుని యిటు నటు లాగుచుండును. సత్వ గుణము ద్వంద్వముల కతీతమైనది. అందు రజస్సు - తమస్సు యిమిడి అదృశ్యమగును. జీవితము ద్వంద్వముల క్రీడయని

గుర్తించిన జీవుడు, అవి కాలానుగుణముగ వచ్చిపోవు చుండునని తెలుసుకొన్నాడు. ప్రజ్ఞ మనస్సుయందుగాక, బుద్ధియందు స్థిరపడును. అప్పుడు సత్వగుణము నిత్య సత్యముగ నుండును. అనగా రజస్సును, తమస్సును అధిష్ఠించి యుండును. అట్టివాడే త్రిగుణములు దాటిన వాడగును. అతడికే పూర్ణమైన రసానుభూతి అందిన ఫలము. ఇతరులకు అందని ద్రాక్ష పండే!

"నిస్త్రైగుణ్యో భవ అర్జునా" అని కృష్ణుడు సుతిమెత్తగ అర్జునుని హెచ్చరించుటకు కారణమిదియే. నిత్య సత్యమే పరిపూర్ణ జీవనానుభూతికి ప్రాతిపదిక.

వేదములు కూడా త్రిగుణాత్మకములైన విషయములనే తెలుపుచున్నవి కాని, తదతీతమైన స్థితికి చేర్చుట లేదనియు, యోగవిద్య ఒక్కటియే పరిష్కారమనియు భగవానుడు స్పష్టముగ తెలిపియున్నాడు.

## 20

# ఆచరణ - ఎఱుక

**యావానర్థ ఉదపానే సర్వత స్సంప్లుతోదకే ।**
**తావా న్సర్వేషు వేదేషు బ్రాహ్మణస్య విజానతః ॥ 46**

వేద మపారము. జ్ఞానమునూ అపారమే. తెలియవలసినది ఎప్పుడునూ యుండును. తెలిసిన దానిని ఆచరించుట అను మార్గమున మరికొంత తెలియుట యుండును. ఈ మార్గమున తెలియుటలో అనుభవము వుండును. అనుభూతి యుండును. మరియూ తెలిసినది అక్కరకు వచ్చును.

ఊరికే తెలుసుకొనుట వలన ఉపయోగములేదు. అది అక్కరకు రాదు. అనుభూతి నీయదు. అనుభవమూ కలుగదు. ఆచరణము లేని జిజ్ఞాస జీవుని భ్రష్టుని చేయగలదు. ఆచరణము లోనే సమస్తమూ అనుభవమునకు వచ్చును. ఊరకే తెలుసు కొనుట వలన మెదడు వాచి, తెలిసిన వాడనను అహంకారము బలిసి జీవుడు భ్రష్టుడగును.

బ్రహ్మమును తెలిసిన వారందరూ ఆచరణ పూర్వకముగా

నెఱిగిన వారే. బోధనలను వినుటవలన, గ్రంథములను పఠించుట వలన, తెలియునది పుస్తక విజ్ఞానమే. ఆచరించు వారిదే అసలు విజ్ఞానము. తెలుసుకొనుట, తెలిసినది ఆచరించుట అనునవి అనుశ్యూతముగ ఉఛ్వాస నిశ్వాసములవలె సాగుట క్షేమము. అది తెలిసిన వారే తెలిసినవారని, యితరులు మిధ్యాచారులని భగవంతుడు బోధించి యున్నాడు.

భారతీయులకిదియే ప్రస్తుత కర్తవ్యము. ఉదాహరణకు, దాహము కలిగిన వానికి బావి కనపడి నప్పుడు, అందుండి తనకు వలసిన జలములను గ్రోలి తృప్తి చెందుట క్షేమము. అంతియేకాని, అసలా బావియందు ఎంత నీరున్నది? దినమున కెంత ఊరు చున్నది? ఎంతమంది ప్రతి దినమూ త్రాగినచో బావి ఎండక యుండును? అను జిజ్ఞాసలో పడినచో, గొంతెండి చనిపోవుటయే యుండును. చదివిన వారందరూ తెలిసినవారు కారనియు, రామకృష్ణ - వివేకానందులవలె ఆచరించినవారే తెలిసినవారని తెలియవలెను.

# 21

# కర్మాధికారము

**కర్మణ్యేవాధికార స్తే మా ఫలేషు కదాచన ।**
**మా కర్మఫల హేతుర్భూ ర్మా తే సంగోఽస్త్వకర్మణి ॥ 47**

ఎన్ని జన్మలెత్తిననూ, ఎంత మేధస్సును పెంచుకొనిననూ, ఎన్ని గ్రంథములు చదివిననూ, ఎన్ని విజయములు పొందిననూ, ఎంత ధనము, కీర్తి సంపాదించిననూ మానవుడు ఎందులకో జీవితమున ప్రాథమిక సూత్రముల ననుసరించుటలేదు. భారత దేశమున వేలాది సంవత్సరములుగా సగటు భారతీయునికి భగవానుడు తెలిపిన ఈ క్రింది సూత్రము తెలియును కానీ ఆచరింపము. ముమ్మాటికీ ఆచరింపము. అందువలనే జీవన విభూతి లేదు.

*సూ॥ "కర్మ చేయుటయందే నీ కధికారము కలదు గాని,*
*ఫలముల యందు నీ కెప్పుడూ అధికారము లేదు."*

ఈ సూత్రము విననివారు లేరు. అంగీకరించి, అనుస రించు వారునూ లేరు! ఇంతకన్న జీవితమున మాయ ఏమి కలదు? కేవలము ఫలము కొరకే ప్రాకులాడు జాతికి నిష్కృతి

లేదేమో!! అను నిస్పృహ కలుగక తప్పదు. అధికారములేని ఫలములయందే అమితాసక్తి మానవ మేధస్సు కనబరచును కాని, తన అధికారములోని కర్తవ్యమును మాత్రము నిర్వర్తించుము. ఇది ఏమి లీల! రోగికి ఔషధము చేదుగా నుండును. అందు వలననే ఔషధము స్వీకరింపక మానవుడు మరల మరల మరణించుచున్నాడు.

కేవలము కర్తవ్యమునం దాసక్తి కలిగి ఫలితమునందు అనాసక్తత కలుగవలెనన్నచో రెండే రెండు ఉపాయములు గలవు. ఒకటి - యోగేశ్వరుల జీవిత చరిత్రలను పఠించి, స్ఫూర్తి చెంది, అట్లు జీవించుటకు ప్రయత్నించుట; రెండవది - మనమధ్య తిరుగాడుచున్న యోగులను గుర్తించి ప్రత్యక్షముగ పై తెలిపిన సూత్రమును దర్శించి, తద్వారా స్ఫూర్తి చెంది, అట్లు జీవించుటకు ప్రయత్నించుట. ఇతరములైన మార్గములు కష్టతరములు.

ఇట్టి ప్రాథమిక సూత్రమును మరచి, పండితులు గీతా పారాయణమునకు కూడా ఫలితమును నుడివిరి. ఫలిత మాశింపక కర్తవ్యమును ఆచరింపుమని లేదా నిర్వర్తింపుమని బోధించు గ్రంథరాజమునకే పండితులు పంగ నామములు పెట్టిరి. వీరు 'కలి' చే నియమింపబడినవారే కాని, తెలిసినవారు కారని తెలియు చున్నది కదా !

నిజముగ జీవితమును పండించుకొనదలచినచో భగవద్గీత యందలి ఈ ఒక్క వాక్యము చాలును.

## 22

# కర్మ సూత్రము

యోగస్థః కురు కర్మాణి సంగం త్యక్త్వా ధనంజయ ।
సిద్ధ్యసిద్ధ్యోః సమో భూత్వా సమత్వం యోగ ఉచ్యతే ॥ 48

దూరేణ హ్యవరం కర్మ బుద్ధియోగా ద్ధనంజయ ।
బుద్ధౌ శరణ మన్విచ్ఛ కృపణాః ఫలహేతవః ॥ 49

చేయు పనుల ద్వారా మనలను మనమే బంధించుకొనుట ఏమి తెలివి? తెలివైన వాడిననుకొనువాడు కూడా తన తెలివితోనే తన జీవితమును చిక్కుపఱచుకొను చున్నాడు కదా! వీరు కొరమాలిన తెలివికలవారే కాని, నిజమైన తెలివిగలవారు కారు. ఒక పని చేయునప్పుడు, దాని నుండి పుట్టు పనులను, చిక్కులను, కష్ట-నష్టములను పూర్తిగ బేరీజు వేసుకొనవలెను. ప్రస్తుతమునకు సౌకర్యముగ నున్నదని, లాభము కలుగుచున్నదని, జయము చేకూరునని, చేయుపనులు అటుపై వికటించగలవు. పెద్దలు యిచ్చిన నానుడిలో ముఖ్యమైన దేమనగా - "పాపము చేయు నపుడు చమ్మగ నుండును. ఫలితము లనుభవించునపుడు చేదుగా నుండును."

కరడుకట్టిన స్వార్థముతో తనకు లాభించునని ప్రతి మానవుడు దాని తరంగముల ప్రభావము తెలియక ఉరుకులు పరుగులు వేయుచూ యితరులను దోచుకొనుచున్నాడు. మానవుడు రాక్షసుడై హద్దూ-పద్దూ లేక భూమి సంపదను, వృక్ష సంపదను, జంతు సంపదను దోచుకొనుచున్నాడు. ఎక్కువ దిగుబడికై వృక్షములు మరియు జంతువుల జన్యువులను కూడా రసాయనక చర్యలతో ఒత్తిడి కలిగించుచున్నాడు. ఇది అంతయూ తనయొక్క మేలునకే అనుకొని చేయుచున్నాడు. చేయు పనులనుండి పుట్టబోవు మహత్తర మైన విపత్తులను గమనించుటయే లేదు. పంచభూతముల సమన్వయమును కూడా భంగపరచుటకు సిద్ధపడిన మానవుడు, ఈనాడు తాను చేసిన పనికి కలుగు ఫలిత మెట్లుండునోనని భయ భ్రాంతుడై జీవించుచున్నాడు. మంచుపర్వతములు కరుగునని, సముద్రములు పొంగునని, అగ్నిపర్వతములు బ్రద్దలగునని, అనివార్యమైన రోగములు ప్రబలునని, జీవనపు అల్లిక చెడిపోవు చున్నదని దుఃఖ పడుచున్న మానవుడు ఈ విపత్కర పరిస్థితికి తానే కారణమని తెలుసుకొనవలెను. తన స్వార్థచింతన తగ్గించు కొని పరహితము పెంచుకొనినచో జీవన విధానమున మార్పు ఏర్పడి పరిష్కారము లభింప గలదు.

ఈనాటి మానవుని తెలివి ఆత్మహత్య గావించుకొను వాని తెలివి వంటిది. శాస్త్ర విజ్ఞానము పెరుగుదల, సంస్కారముల తరుగుదల కారణముగ అతి వేగముగ ప్రమాదమువైపు పరుగిడు చున్నాడు. మనము చేయుపనులు పదిమందికి పనికి వచ్చునట్లు చేసినచో బంధస్థితి నుంచి మోక్షస్థితి వైపు మార్గమున మలుపు రాగలదు.

ప్రతి జీవియు తన జీవన నిర్మాణ పథమున ఎప్పటికప్పుడు జీవితముపై తన స్వామిత్వమును పరికించుచుండవలెను. అట్లు కానిచో వృత్తి, కుటుంబము, సంఘము, అతనిని బంధించగలవు. జీవితము ముందుకు సాగుచున్నకొలది, బాధ్యతలు పెరిగిననూ మనసున బంధము పెరుగరాదు. బంధములు పెంచుకొను మార్గము చావుతెలివి. ఉదా : మంచి గదిని నిర్మాణము చేసుకొను వాడు తన చుట్టునూ ఇటుకపై ఇటుక పేర్చుకొనుచూ నలువైపులా గోడను నిర్మించుకొనినచో బయటకు పోవు దారిలేక తను నిర్మించిన గదియే నిర్గమశూన్యమగు దుర్గమై తాను సమాధి చెందుటకు కారణమగును.

ప్రతివ్యక్తియూ ఈనాడు తన పెరుగుదల రూపమున ఈషణ త్రయమున విపరీతముగ బంధించుకొనుచూ తన గోరీని తానే నిర్మాణము చేసుకొనుచున్నాడు. అంతియేకాదు, తనంత తెలివిగ యితరులు గోరీలు కట్టుకొన కూడదని పోటీపడుచూ అందమైన గోరీని నిర్మాణము చేసుకొను చున్నాడు. జీవితమును ఒక కారాగారముగ నిర్మించుకొనుటగా కాక, రాకపోకలు గల ఒక గృహముగ నేర్పాటు చేసుకొనుటకు వలసిన సూత్రమునే భగవానుడు-

"మాకర్మ ఫలహేతుర్భూ"

అని హెచ్చరించి యున్నాడు. చిన్నతనముననే ఈ ఎఱుక కలిగినచో జీవిత మానందమయ మగుటకు అవకాశముండును. తిమింగలముచే పట్టబడిన తరువాత తెలిసినచో బంధమోచనము కష్టతరము. ఎవరైననూ వచ్చి రక్షించవలసినదే కాని, తనను తాను రక్షించుకొనలేడు. అట్టివానికి గజేంద్రుడు చేసిన ప్రార్థనయే శరణ్యము.

## 23

# కర్తవ్యము - పాప - పుణ్యములు

**బుద్ధియుక్తో జహాతీహ ఉభే సుకృత దుష్కృతే ।**
**తస్మా ద్యోగాయ యుజ్యస్వ యోగః కర్మసు కౌశలమ్ ॥ 50**

బుద్ధిలోకములో నుండి పనిచేయువాడు పుణ్య కర్మలని, పాప కర్మలని విభజించి ఫలితముల నుద్దేశించి పనులు చేయడు. ఆ భావమును విసర్జించి తన కర్తవ్యమును నిర్వర్తించును. ఫలితము లపై ఆశ లేనివానికి పుణ్య పాపముల విభజన వుండదు. అతనికి కర్తవ్యము మాత్రముండును. కర్తవ్యమును మాత్రమే ఉద్దేశించు కొనుచు వివేకముతో పనిచేయు వానిని కర్మఫలములు బంధించవు. పుణ్యపాపముల విభజనము మనోలోకములకు సంబంధించినది. బుద్ధిలోకములకు సంబంధించినది కాదు. బుద్ధి లోకమున కర్తవ్యము ధర్మ సంరక్షణము ననుసరించి యున్నది. ధర్మ రక్షణమునకై కృష్ణుడు 'ఆయుధము పట్టను' అను మాటను ప్రక్కన పెట్టి భీష్ముని పైకి సుదర్శనముతో దుమికెను. ఆడిన మాట తప్పను అని భీష్మించి భీష్ముడు పెళ్ళిని, సంతతిని నిరాక

రించి కురు వంశమునకు నష్టము కలిగించెను. సత్యవతీదేవి వేడుకొనినను వినలేదు. ధర్మమును కర్తవ్యము రూపమున అనుసరించుటయే బుద్ధియుక్తమగు జీవనము. అట్టి జీవనమున ఫలాసక్తి లేకుండుట కౌశలముతో గూడిన కర్మయోగ మగును.

# 24

## మనీషి

కర్మజం బుద్ధియుక్తా హి ఫలం త్యక్త్వా మనీషిణః ।
జన్మబంధ వినిర్ముక్తాః పదం గచ్ఛం త్యనామయమ్ ॥ 51

యదా తే మోహకలిలం బుద్ధి ర్వ్యతితరిష్యతి ।
తదా గంతాసి నిర్వేదం శ్రోతవ్యస్య శ్రుతస్య చ ॥ 52

శ్రుతివిప్రతిపన్నా తే యదా స్థాస్యతి నిశ్చలా ।
సమాధా వచలా బుద్ధి స్తదా యోగ మవాప్స్యసి ॥ 53

బుద్ధితో యోగించి, ఫలములను త్యజించి, కర్తవ్యమును నిర్వర్తించు యోగికి నిస్సంగము ఏర్పడగలదు. అతనికి కర్తవ్యమే యుండునుగాని, వ్యక్తిగతమగు ఆశయములు, గమ్యములు వుండవు. అనగా తాను, తన కర్తవ్యము మాత్రమే యుండును. మరణించ కూడదని యుండదు. పుట్టకూడదని కూడ యుండదు. మరణించకూడదని, పుట్టకూడదని, పుణ్య కర్మలను ఆచరించు వారు కళాసక్తితో ఆచరించు వారే తప్ప వారికి పుట్టని, చావని స్థితి కలుగనేరదు. శ్రీకృష్ణుడు తెలిపిన యోగజీవులు ఎట్టి సిద్ధుల కొఱకును ప్రయత్నింపరు. అమరత్వము కొఱకు, బ్రహ్మత్వము

కొఱకు ప్రయత్నముండదు. ఉండుటయే యుండును. కర్తవ్య ముండును. వారికి నిస్సంగము పరిపూర్తి యగుటచే కోరకయే సమస్తమును లభించగలదు. వారి చేతలయందు కళాసక్తి లేదు గనుక బంధము నుండి విడువబడిన వారలై యుందురు. బంధము లేక యుండుటయే పరమ పథము. అట్టివారు శరీరము నందు కూడ యుందురు. శరీరము వారిని బంధింపదు. ఎటు చూచినను ఫలమునందు ఆసక్తిలేని కర్తవ్య కర్మమే శ్రేయోదాయకమని భగవంతుడు బోధించుచున్నాడు.

బుద్ధి, మోహమును, మాయను, అజ్ఞానమును విసర్జించి, తాను అను వెలుగుగా నున్నప్పుడు నిర్మలమైన బుద్ధి అని తెలియబడుచున్నది. నిర్మలమైన బుద్ధి ఏర్పడవలె నన్నచో సతతము లోపల, వెలుపల ఆత్మానుసంధానము చేసుకొను చుండవలెను. దీనిని దైవయోగము అందురు. అనగా బుద్ధిని దైవముతో జత పరచుట. ఇది నిరంతరము సాగినప్పుడు బుద్ధి నిర్మలమగును. అట్టి బుద్ధితోనే నిష్కామముగ కర్మల నాచరించిన జనన మరణ రూప బంధమునుండి కూడ జీవుడు విడుదలను పొందును అని భగవానుడు చెప్పియున్నాడు. అట్టి బుద్ధియే ధర్మముతో కూడిన కర్తవ్యములను సతతము నిర్వర్తించగలదు. అట్టి నిర్వర్తనమే కర్మలయందు కౌశలము అని తెలిపి యున్నాడు. బుద్ధి, ఆత్మయందు యోగించగ, అట్టి బుద్ధితో యోగించిన మనస్సు కర్మలను క్షేమముగను, కౌశలముగను నిర్వర్తించ గలదని అర్థము. యోగము చెందని మనస్సు కౌశలముగ కర్మలను

నిర్వర్తించుట జరుగదు. అట్టి మనస్సే కౌశలము పేరున కుటిలత్వము ననుసరించును.

కావున బుద్ధిని సదా ఆత్మతో అనుసంధానము చేయవలెను. అట్టి బుద్ధి క్రమశః నిర్మలమగును. చీకటిని దాటిన బుద్ధిగా వెలుగొందును. అనగా మాయా వర్ణమును దాటి యుండును. అట్లు దాటి యుండుటకు కారణము ఆత్మానుసంధానమే. అట్టి బుద్ధి కర్మలను సహజముగనే నిర్లిప్తముగను, బంధములు కలిగించని విధముగను, నిర్వర్తించుచుండును. ఏది వినినను, ఏది చూచినను వికారము చెందదు. చలనము లేని ఇట్టి బుద్ధిని పొందుట కర్తవ్యమని భగవానుడు బోధించుచున్నాడు.

## 25

# స్థిత ప్రజ్ఞుడు

అర్జున ఉవాచ :

స్థితప్రజ్ఞస్య కా భాషా సమాధిస్థస్య కేశవ ।
స్థితధీః కిం ప్రభాషేత కి మాసీత వ్రజేత కిమ్ ॥ 54

శ్రీభగవా నువాచ :

ప్రజహాతి యదా కామాన్ సర్వాన్ పార్థ మనోగతాన్ ।
ఆత్మన్యే వాత్మనా తుష్టః స్థితప్రజ్ఞ స్తదోచ్యతే ॥ 55

ఆత్మ ధ్యానమునందు స్థిరమైన స్థితిగొన్న బుద్ధి, స్థిరబుద్ధి. అట్టి బుద్ధి కలవాడు స్థితప్రజ్ఞుడు. అనగా స్థిరమైన ప్రజ్ఞ కలవాడు. ఆ సన్నివేశములను బట్టి అతని ప్రజ్ఞ కలత చెందదు. మోహము కలిగిననే కదా కలత చెందుట! ఆత్మజ్ఞాన రతునికి మోహ ముండదు గనుక కలత కూడ నుండదు. అతడు ముక్తజీవి. అతని గుణ గణములు శ్రీకృష్ణుడు ఉదహరించుచున్నాడు.

1. సమస్తములైన కామములను బొత్తిగ వదలివేసినవాడు స్థితప్రజ్ఞుడు. కర్తవ్యమేగాని కామములేని స్థితి ఇది. కర్తవ్యమును కామమును ఎప్పటికప్పుడు బుద్ధితో విచక్షణ చేసి కర్తవ్యమునే

నిర్వర్తించువాడు స్థిరప్రజ్ఞ కలవాడు. ఇష్టాయిష్టములు, లాభనష్ట ములు, సౌకర్య అసౌకర్యములు, జయాపజయములు, బేరీజు వేసుకొని పనిచేయువారు కామమునకు లోబడినవారు కాని కర్తవ్యమునకు కాదు.

2. సతతము తన ప్రజ్ఞను దైవీప్రజ్ఞతో అనుసంధానము చేసి తుష్టితో జీవించువాడు స్థితప్రజ్ఞుడు. ఈ రెండవ గుణము నాశ్రయించి, మొదటి గుణమును పొందవలెను.

26

# స్థిత ప్రజ్ఞుడు

దుఃఖేష్వనుద్విగ్న మనాః సుఖేషు విగతస్పృహః ।
వీతరాగ భయక్రోధః స్థితధీ ర్మని రుచ్యతే ॥ 56

స్థితప్రజ్ఞుని బుద్ధి కష్టములందు కలత చెందదు. సుఖముల యందు ప్రత్యేకమైన ఆసక్తి చూపదు. సన్నివేశములయందు భయపడదు. ఇతరుల ప్రవర్తన వలన క్రోధము చెందదు. అతని మనస్సు సహజముగ మౌనముగ నుండును. (ఆత్మ మననము చేత మౌనము వహించి యుండును.)

పై ఐదు గుణములు ఎవని ప్రవర్తనమున గోచరించునో అతడు స్థితప్రజ్ఞుడుగ తెలియబడు చున్నాడని భగవానుడు బోధించుచున్నాడు.

## 27

# స్థిత ప్రజ్ఞుని లక్షణములు

యః స్సర్వత్రా నభిస్నేహ స్తత్తత్ప్రాప్య శుభాశుభమ్ ।
నాభినందతి న ద్వేష్టి తస్యప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥ 57

ఏ విషయమునందు ప్రత్యేకమైన అనురాగము లేనివాడు, అట్టి కారణముగ అశుభ విషయములను పొందినపుడు ద్వేషము పొందనివాడు, శుభ విషయములు పొందినపుడు అందు అనురక్తి చెందనివాడు స్థితప్రజ్ఞుడని తెలియవలెను.

శుభాశుభ విషయములు వచ్చి పోవుచుండును. సమస్త సన్నివేశములు కూడ కాల ప్రభావమున ఒకింత సేపు వుండి అటుపై లేకపోవును. అట్టి వానియందు ఆసక్తి కలిగియుండుట లేక అనాసక్తి కలిగియుండుట తెలియని తనమే. తాత్కాలిక విషయములయందు రసానుభూతి కూడ తాత్కాలికమే కనుక అట్టి జ్ఞానమును కలిగి వానియందు తాత్కాలికముగ ప్రతి స్పందించి మరచువాడు స్థితప్రజ్ఞుడు.

స్థితప్రజ్ఞ అను బుద్ధి శాశ్వత విషయమైన ఆత్మ తత్త్వము నందు రతి గొని వుండుట వలన చిల్లర విషయముల యందు ఆసక్తిగాని, అనాసక్తి గాని యుండదు. ధనవంతునికి ఒక పావులా పోయినను, ఒక పావులా వచ్చినను తేడా ఉండదు కదా!

# 28

# స్థిర చిత్తము

**యదా సంహరతే చాయం కూర్మోఽంగానీవ సర్వశః ।**
**ఇంద్రియాణీంద్రియార్థేభ్య స్తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥ 58**

తాబేలు ఆధ్యాత్మిక సాధకునకు చక్కని సందేశ మిచ్చు చున్నది. పరిస్థితులను బట్టి తాబేలు తన సర్వాంగములను తన లోనికి ఉపసంహరించుకొని అనుకూల పరిస్థితులు ఏర్పడి నపుడు మరల అంగములను విస్తరించును. పురోగమనము, తిరోగ మనము తెలిసిన ప్రజ్ఞ- తాబేలు ప్రజ్ఞ. మానవుడుకూడ నట్లే పురోగమనము, తిరోగమనము తెలిసి యుండవలెను. కాలము, దేశము ననుసరించి అనుకూల సమయమున మనస్సు, ఇంద్రియ ములు, శరీరమును ఉపకరణములుగ బహిర్గతు డవవలెను. కర్తవ్యము నిర్దేశింపబడని సమయములందు అంతర్గతు డవవలెను. అవసరమును బట్టి బహిర్గతు డగుట, అవసరము లేనపుడు అంతర్గతు డగుట నేర్చు కొనవలెను.

ఇంద్రియార్థముల వెంటబడు ఇంద్రియ ప్రజ్ఞను ఉపసంహా రించుకొనుట వలననే చిత్తము స్థిరమగును. ఇచట దోషము

ఇంద్రియముల యందు లేదు. సాధకుని యందే యున్నది. సాధకుడు తిరోగమనమును సంకల్పించినంతనే ఇంద్రియముల నుండి, మనస్సు నుండి, బుద్ధిలోనికి ప్రజ్ఞ మరలగలదు. అట్లు మరల్చుకొనుటకు దైవచింతన చక్కని ఉపాయము. దైవస్మరణమున నిలచినచో ఇంద్రియార్థముల వెంట ఇంద్రియములు పరుగెత్తవు. అపుడు ప్రజ్ఞ చంచలము గాక నిలచును. కర్తవ్యమును బట్టి ప్రజ్ఞను బహిర్ముఖము చేయవచ్చును. ఈ కారణముగ తాబేలు బొమ్మను చూచుట- పై సందేశమును గుర్తు తెచ్చుకొనుట సాధకునకు ఉపకరించును.

## 29

# ఆత్మ చింతన

విషయా వినివర్తంతే నిరాహారస్య దేహినః ।
రసవర్జం రసోఽప్యస్య పరం దృష్ట్వా నివర్తతే ॥ 59

దైవచింతన లేక ఆత్మచింతన దీర్ఘకాలము జరిగిన వానికి విషయ చింతన తొలగుటయే కాక క్రమశః వాని వాసన కూడ తొలగిపోగలదు. దైవమును నమ్ముట వేరు, దైవము నచ్చుట వేరు. నచ్చినపుడే మనస్సునకు ఆసక్తి కలుగును. అట్టి ఆసక్తి వలన మనస్సు దైవమునందే రమించుటకు పదే పదే కోరుకొను చుండును. అనురక్తి దైవము పైకి మరలక అది హెచ్చు చుండును. ప్రబల మగుచుండును. అది కారణముగ తాత్కాలిక సుఖ సంతోషములకన్న శాశ్వత సంతోషమునందు రుచి కలుగుటచే విషయ వాసనలయందు కూడ క్రమశః ఆసక్తి తొలగిపోవును. ఇంద్రియార్థముల వెంట తీరుబడి లేక తిరుగువాడు ఎట్లు ప్రవర్తించునో అట్లే తీరుబడి లేని దైవచింతన యందు మనస్సు పాదుకొని ఇంద్రియార్థములందు కూడ దైవమునే గుర్తించుట జరుగుచుండును. ప్రకృతి దైవీప్రకృతిగ గోచరించును. తన ప్రకృతి దైవీప్రకృతి కాగ సమస్తము నందలి దైవమునే చూచుచు స్థిర

మతియై యుండును. అతనిని దైవము తప్ప మరి ఇతరములు ఆకర్షించవు. అట్టివాడు 'స్థితప్రజ్ఞుడని' భగవంతుడు తెలుపు చున్నాడు.

జీవుడు ఆహారమును అనేక రకములుగ స్వీకరించు చున్నాడు. కేవలము భోజనమే ఆహార మనుకొనరాదు. పంచేంద్రి యముల నుండి, మనస్సు నుండి (అనగా భావము నుండి) రక రకములైన విషయములను తన లోపలికి మనిషి స్వీకరించు చున్నాడు. ఈ ప్రవృత్తి కూడ ఆహారమే.

ఇక్కడ ఆహారము వాసనాపరముగ నుండును. ఈ వాసనలు జన్మ జన్మలలో జీవుడు ప్రోగుచేసుకొని తనతో తెచ్చుకొనుచుండును. మాలిన్య పదార్థములను ప్రోగుచేసుకొని తెచ్చుకొను జంతువువలె జీవుని మనస్సు ఈ వాసనలను కూడ శుభవాసనలతో పాటు కొనితెచ్చుకొనును. ఈ ఆహారమును విసర్జించుట నిజమైన నిరాహార దీక్ష.

ఉదాహరణకు భోజనమును గూర్చిన ఆసక్తి భుజించని సందర్భములలో ఉండినచో అది వాసన యగును. భార్య లేని సమయములో భర్తకు భోగాసక్తి యుండుట వాసన యగును. ఇట్లే ధనము గూర్చి, ఇతర చిల్లర విషయముల గూర్చి అవి లేని సందర్భమున భావించుట వాసనయే.

ఈ వాసనలు కూడ ఆహారముగ సంకేతింపబడినవి. వీటియందు రతి చెందినవాడు సతతము అశుద్ధ ఆహారమును భావముచే స్వీకరించుచుండును. వీని విసర్జన సులభమైన

విషయము కాదు. ఆత్మ విచార మొకటియే పరిష్కారము. ఆత్మ తత్త్వమును గూర్చి వినుట, మననము చేయుట బాగుగ సాగినచో నిత్యానిత్య వస్తువివేక మేర్పడి ఆత్మజ్ఞానమునందు రుచి కలుగును. ఆ జ్ఞానము అగ్ని వంటిది. అగ్ని సమక్షమున ఏదియును నిలువక అగ్నిలో లయమగును. ఆ విధముగ వాసన లంతమొందును. అట్టివాడు ఇంద్రియార్థ విషయములను స్వీకరింపనట్టి దేహము కలవాడై యుండును. అతడు స్థితప్రజ్ఞుడు. అతడే నిరాహారి.

## 30

# ఇంద్రియములు - సౌలభ్యము - ప్రమాదము

యతతో హ్యపి కౌంతేయ పురుషస్య విపశ్చితః ।
ఇంద్రియాణి ప్రమాథీని హరంతి ప్రసభం మనః ॥ 60

ఇంద్రియ నిర్మాణము సృష్టి నిర్మాణ మహా యజ్ఞమున అత్యంత ప్రాధాన్యము గలదు. సృష్టి నిర్మాణమున జీవులకు దేహము లేర్పరచి, ఆ దేహములందు జీవుని ప్రతిష్ఠాపన చేసి, దేహము ద్వారా సృష్టి వైభవమును అనుభవింపచేయుట సృష్టి సంకల్పములో నొక భాగము. జీవుని దైవమునుండి ప్రత్యగాత్మక వ్యక్తము చేయుట ఒక మహత్తర ఘట్టము. ఏకము, అనేకమగుట ఒక యజ్ఞముగ సాగినది. జీవులేర్పడిన వెనుక వారికి దేహము లేర్పరచుట మరియొక మహత్తర యజ్ఞము. జీవులకు, దేహము లకు పరస్పరత్వ మేర్పరచి జీవ చైతన్యమును ఇంద్రియముల ద్వారా బాహ్యమునకు ప్రకటింపచేయుట ఒక రసవత్తర ఘట్టము.

ఇదియే భాగవతమున ప్రచేతసుల కథగ వివరింపబడినది. జీవుని బహిర్గతుని చేయుటకు బృహత్తర ప్రయత్నము జరిగినది.

అందులకు ఇంద్రియము లేర్పరచి, ఇంద్రియముల ద్వారా జీవుని ఆకర్షింపబడు విషయము లేర్పరచవలసి వచ్చెను. క్రమశః జీవుడు ఇంద్రియములనుండి బహిర్గతుడగుట నేర్చెను. ఇంద్రియార్థము లందు బాగుగ రుచిగొని బహిర్గతుడిగ వుండిపోయెను. అందు వలన భగవానుడు ఇంద్రియములు జీవుని బలాత్కారముగ లాగుచున్నవని తెలుపుచున్నాడు. ఇంద్రియ నిర్మాణము అందు కొఱకే.

ఆత్మసాధన మార్గమున జీవుడు ఇపుడు తిరోగమనము నేర్వవలెను. తిరోగమనము మాత్రమే నేర్చిన చాలదు. తిరోగ మనము తెలియకున్న సృష్టి వ్యూహమున చిక్కును. ఇదియే అభిమన్యుడు పద్మవ్యూహమున చిక్కుట. అట్లు చిక్కువాడు నశించును. ఈ ఇంద్రియ వ్యాపారమునుండి బయల్పడుటకు కూడ మరల మహత్తర ప్రయత్నమే చేయవలెనని భగవానుని హెచ్చరిక.

# 31

# మత్పరత్వము

తాని సర్వాణి సంయమ్య యుక్త ఆసీత మత్పరః ।
వశే హి యస్యేంద్రియాణి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥ 61

ధ్యాయతో విషయాన్ పుంసః సంగ స్తేషూపజాయతే ।
సంగా త్సంజాయతే కామః కామాత్క్రోధోఽభిజాయతే ॥ 62

క్రోధా ద్భవతి సమ్మోహః సమ్మోహాత్ స్మృతి విభ్రమః ।
స్మృతిభ్రంశా ద్బుద్ధినాశో బుద్ధినాశా త్ప్రణశ్యతి ॥ 63

ఇంద్రియములను ఇంద్రియార్థముల వెంట పరిగెత్తకుండ నియమించుటకు భగవాను డొక ఉపాయమును తెలుపుచున్నాడు. అది ఏమన దైవమునందు చిత్తమునకు రుచి ఏర్పరచు టయే. మనస్సు రుచిని కోరును. రుచించు విధముగ మనస్సునకు దైవము నందించవలెను. అపుడు మనస్సు దైవమున రుచి గొనును. ఈ ఉపాయము తెలిసిన ఋషులు వివిధములైన రుచి మార్గముల నేర్పరచిరి. భజనము, సంకీర్తనము, పూజనము, శ్రవణము, అభిషేకములు, హోమములు, స్తోత్రములు మొదలగు వేలాది పద్ధతులను అందించుటలో ఋషులుద్దేశించిన దేమనిన,

అందు జీవున కేది రుచించునో దాని ద్వారమున దైవమును రుచిగొని దైవాసక్తుడగునని. ఒక్కసారి దైవమునందాసక్తి ఏర్పడి నచో అది ధర్మమునం దాసక్తిగ కూడ నేర్పడి క్రమశః ఇంద్రియ ముల నుండి తరింపు ఏర్పడును. 'మత్పరుడవై' యుండుము, అని భగవానుడు బోధించుటలో చక్కని ఉపాయము కలదు. ప్రజ్ఞను సుప్రతిష్ఠము చేయుటకు ధర్మాచరణము దైవారాధనమని తెలియవలెను.

దైవమును చింతించువాడు స్థితప్రజ్ఞు డగును. విషయము లను చింతించువాడు సంసారి యగును. దైవమునందాసక్తి దైవమును కోరును. ప్రాపంచిక విషయములందాసక్తి వివిధ విషయములను కోరును. కోరిక తీరినచో మదము పెరుగును. తీరనిచో కోపము పెరుగును. రెండు విధములుగ అవివేక మావ రించును. అవివేకము కారణముగ మఱపు కలుగును. మఱపు కారణముగ బుద్ధి నాశనము సంభవించును. అట్టివాడు సమ్మో హితుడై నశించును. ఈ విధముగ విషయవాంఛ పతనమును గావించును. కర్తవ్యమును మరచి కోరికను పెంచు కొనువారికి ఇట్టి వినాశము తప్పదని భగవంతుని హెచ్చరిక.

## 32

# ప్రసాదము

రాగద్వేష వియుక్తైస్తు విషయా నింద్రియై శ్చరన్ ।
ఆత్మవశ్యై ర్విధేయాత్మా ప్రసాద మధిగచ్ఛతి ॥ 64

ప్రసాదమనగా మనో నిర్మలత్వము. మనో నిర్మలత్వమును పొందుటకు మనస్సు స్వాధీనము కావలెను. మనస్సు స్వాధీన మగుటకు రాగద్వేషాది ద్వంద్వములను అధిగమించవలెను. ద్వంద్వముల నధిగమించిన మనస్సుతో ఇంద్రియముల నుండి ప్రవర్తించు మానవుడు మనో నిర్మలత్వమును పొందుచున్నాడు.

ప్రసాద స్వీకరణము అనగా సాధారణముగ కట్టె పొంగళి, చక్రపొంగళి, చిత్రాన్నము ఇత్యాది ఆహార పదార్థములను పూజాది కార్యక్రమములు జరిగిన తరువాత భుజించుట అని భావింతురు. కేవలము భుజించుటే అయినచో అది భోజనమగును.

భోజనమునకు, ప్రసాద స్వీకరణకు వ్యత్యాసము కలదు. నిర్మలమైన మనస్సు గలవాని ప్రసాద స్వీకరణము విశిష్టముగ నుండును. అతడు రుచియందు రాగముగాని, రుచి లేకపోవుట

యందు ద్వేషము గాని భావింపక, రుచియందు యుక్తుడైయుండక ప్రశాంతము, నిర్మలము అగు మనస్సుతో అందించిన ప్రసాద మును బ్రహ్మమని భావన చేయుచు, బ్రహ్మమునకు సమర్పణగా ఇంద్రియముల ద్వారమున గైకొనును. ఇట్లే మిగిలిన ఇంద్రియ వ్యాపారము లందు కూడ ప్రవర్తించును. ఇట్లు ప్రవర్తించువాని మనో నిర్మలత్వము ఇంద్రియార్థముల కారణమున చెడదు. ప్రశాంతత చెదరదు.

అట్లుకాక ప్రసాదములో ఉప్పెక్కువయిన దనియు, కార మెక్కువైన దనియు, పోపు తక్కువైనదనియు ప్రసంగించువారు నిర్మలచిత్తులు కాలేరు. కారణమేమన ఇంద్రియార్థముల యందు గల రాగ ద్వేషములు. ఇట్టి రాగ ద్వేషములు సన్నివేశములయందు, ఇతర జీవులయందు, కర్తవ్యముల యందు, కార్యముల యందు గోచరింప జేయువాడు ప్రశాంతతను పొందలేడు. మనో నిర్మ లత్వము ఎండమావివలె మురిపించునుగాని అనుభూతికి అందదు.

భగవానుడు మనో నిర్మలత్వమును పొందుటకు ఒక ఉపాయమును సూటిగా సూచించుచున్నాడు. అది యేమన "నిర్వర్తించుచున్న కార్యము నందు కర్తవ్యమునే దర్శింపుము. రాగ ద్వేషములను ప్రతిబింబింప కుండుము." "రాగద్వేష వియుక్తైః" అని తెలుపుట ఇందులకే. అట్టివానికే మనసు స్వాధీనము కాగలదు. అట్టివాడు కర్మల యందున్నను నిర్మలత్వము కోల్పోవును. చేయు పనులలో కర్తవ్యము నుండి కామ ముద్భవించి

నచో అది రాగద్వేషములకు, కామక్రోధములకు, లోభమోహాము లకు, ఈర్ష్య అసూయలకు దారితీయును. అట్టివానికి మనస్సు వశము కాదు. జీవితమను ప్రసాదమును అనుభవించలేడు. ప్రసాదమును అనుభవించువాడే దేహమును గూడ ఒక రాజ ప్రాసాదముగ అనుభవింపగలడు.

పై శ్లోకమున రాగద్వేష విముక్తుడగుట, అట్టి మనస్సుతో ఇంద్రియ ద్వారమున కర్మలను నిర్వర్తించుట, తత్కారణముగ మనస్సు స్వాధీనమగుట, అట్టి స్వాధీనమైన మనస్సు నిర్మలత్వ మును, శాంతిని పొందుట సోపానములుగ తెలుపబడినది. ఇది ఉత్కృష్టమైన సాధనాంశము.

# 33

# ప్రసాద స్థితి

ప్రసాదే సర్వదుఃఖానాం హాని రస్యోపజాయతే ।
ప్రసన్న చేతసో హ్యాశు బుద్ధిః పర్యవతిష్ఠతి ॥ **65**

బుద్ధిమంతుడగు సాధకుడు సద్గ్రంథములందు వాడిన పదములను శ్రద్ధాభక్తులతో, పరిశీలనా దృష్టితో గ్రహించుట నేర్వవలెను. అపుడే గ్రంథస్థ విషయము నందలి లోతులు లేక రహస్యములు బయల్పడగలవు. ఈ దృష్టి శ్రద్ధాళువుల కుండును. కావున గ్రంథ పఠనమునకు శ్రద్ధ అత్యంత అవసరము.

ఉదాహరణకు పై శ్లోకమున ప్రసాదము స్వీకరించుటచే సర్వ దుఃఖములు నశించుననియు, ప్రసన్నమైన మనస్సు కలుగు ననియు, అట్టి మనస్సు బుద్ధియందు స్థిరపడుననియు తెలుపబడి యున్నది. ఇది కారణముగ భగవత్కార్యముల యందు ప్రసాదము నకు విశేష స్థాన మేర్పడినది. నిజమునకు ప్రసాదమనగా తిండి పదార్థము కాదు. ప్రశస్తమైన మనో నిర్మలత్వము. పూజ, అభిషేకము, హోమము మొదలగు దైవారాధన కార్యములను సత్వగుణ ప్రధాన ముగ నిర్వర్తించు వానికి ఏర్పడు స్థితి "ప్రసాద స్థితి."

అతడు పై కార్యములను సత్వగుణ ప్రధానముగ నిర్వర్తించుటచే అందలి ఫలితముగ మనో నిర్మలత్వమును పొందుచున్నాడు. అట్టి మనో నిర్మలత్వము కారణముగ వృద్ధి గావింపబడిన అతని చేతస్సు బుద్ధియందు స్థిరపడుచున్నది. అది ప్రసాద ఫలితము. కేవలము 'పొట్ట' నిండ ప్రసాదము మెక్కువానికి ఈ స్థితి కలుగదు. వారు మరియొక ప్రసాద భక్తులు. భగవంతుడు తెలిపిన ప్రసాదము సామాన్యు లెరిగిన ప్రసాదము కాదని తెలియవలెను.

పూజాది కార్యక్రమములను డంబాచారముగ, కీర్తికొరకు నిర్వర్తించువారు రజోగుణ దోషము కలిగిన వారు. వీరు ఎన్ని పూజలు నిర్వర్తించి నప్పటికిని మనశ్శాంతి కొరవడును. ఆరాటములు, తత్సంబంధిత వికారములు, వారి ప్రవర్తనల యందు గోచరించుచుండును. వారి నుండి అనుస్యూతము అశాంతి ప్రసరించుచుండును.

శాస్త్రవిధుల నుల్లంఘించి, పూజాది క్రతువులను తమ ఇష్టము వచ్చినట్లు చేయువారు తమోగుణ దోషము కలవారు. వీరు చేయు క్రతువులు వీరినే బంధించగలవు. దుష్ఫలితములు గూడ ఏర్పడగలవు.

యజ్ఞార్థ కర్మలు, దైవకార్యములు మనోనిర్మలత్వమును చేకూర్చ వలెను. అదియే ప్రసాద స్థితి. తెలుగువారు "సాద, సీద" అను పదములను వాడుచుందురు. ఒక వ్యక్తి నుద్దేశించి అతడు సాద, సీద మనిషి అని అనుచుందురు. నిజమునకు వారి ఉద్దేశ్యము స్పష్టత, ముక్కుసూటితనము కలవాడని తెలుపుటకు పై పదములు

వాడుదురు. సాద అన్న పదము స్పష్టతకు సంకేతమైనచో ప్రసాద అను పదము ప్రశస్తమైన స్పష్టత అని తెలియవలెను. అట్లే సీద అను పదమును ప్రసీదగా భావించ వలెను. ఇట్టి పరిశీలనా బుద్ధి చదువరు లేర్పరచుకొందురు గాక !

ప్రసాద స్థితి వలన సర్వదుఃఖములు నశించుట సహజము. ప్రసాద మనగా మనో నిర్మలత్వము అని ఇదివరకే తెలుపబడినది. రాగద్వేషాది ద్వంద్వములు లేక దీర్ఘకాలము కర్తవ్యములను నిర్వర్తించు వానికి ఈ నిర్మల స్థితి ఏర్పడునని కూడ ఇదివరకే తెలుపబడినది. రాగద్వేష విముక్తునకు మాత్రమే కదా ప్రసాదస్థితి. ద్వంద్వములతో ముడి తెగినవానికి కర్తవ్యమే ఉండునుగాని, దాని ఫలితము లిట్లుండవలెనని ఆశయ ముండదు.

ఇది భగవానుని ముఖ్యమైన బోధ. "నీ ధర్మమును నీవు నిర్వర్తింపుము. ధర్మ నిర్వహణ యందు ప్రశాంతత యున్నది. అట్టి ప్రశాంతత ఫలితములను కోరినపుడు లేదు. జయము, అపజయము నీ కనవసరము. కర్తవ్య నిర్వహణమే నీవంతు." అని అర్జునునకు మరల మరల బోధించినాడు కదా. జీవుని మనస్సు కర్తవ్యము నందే నిమగ్నమై నపుడు "ఇట్లు జరుగవలెను, ఇట్లు జరుగరాదు" అను భావములందు చిక్కుకొన నపుడు అతనికి దుఃఖ కారణమే లేదు. కావున దుఃఖమే లేదు.

అట్టి నిర్మలత్వము నొందిన మనస్సు మిక్కుటముగ, శీఘ్ర ముగ బుద్ధియను వెలుగునందు నిలచును. **64, 65** శ్లోకములు జీవచైతన్యము ఇంద్రియార్థముల నుండి బుద్ధిని చేరు సోపాన మును వివరించుచున్నవి.

# 34

# చిత్త శుద్ధి

**నాస్తి బుద్ధి రయుక్తస్య న చాయుక్తస్య భావనా ।**
**న చాభావయతః శాంతి రశాంతస్య కుతః సుఖమ్ ॥ 66**

ప్రజ్ఞ బుద్ధియందు స్థిరపడుటయే బుద్ధియోగము. అట్లు బుద్ధియందు నిలబడవలెనన్నచో మనస్సు నిర్మలము కావలయును. మనస్సు నిర్మలము కావలెనన్నచో ఇంద్రియములు ఇంద్రియార్థ ముల యందు తగులుకొని యుండరాదు. తగులు కొనక యుండుటకు సాధకుడు ద్వంద్వ భావముల నుండి బయల్పడ వలెను. సృష్టి యందలి ద్వంద్వములు జీవుని బంధించునని తెలుసుకొని ద్వంద్వముల యందు ఉదాసీనుడుగా నుండుట, కర్తవ్యము నందు ఉన్ముఖుడై యుండుట నిరంతరము సాధన సాగవలెను. ఇది యొక్కటియే ఇంద్రియముల యందు చిత్తము తగులు కొనక శుద్ధిగ ఉండుటకు ఉపాయము. మరియొక మార్గము లేదు. ద్వంద్వములు మనసున ఉన్నంతకాలము అవి రాగద్వేషములుగ పని చేయుచునే యుండును. అది కారణముగ మనస్సు నందలి ప్రజ్ఞ బుద్ధి లోనికి ఊర్ధ్వగతి చెందకపోగా

ఇంద్రియములలోనికి అధోగతి చెందగలదు. కావుననే కర్మకు కర్తవ్యమే ప్రధానముగాని కామము కాదు.

కామ ప్రేరితుడుగాక కర్తవ్య ప్రేరితుడై జీవించుట భగవంతు డందించు చున్న ఉపాయము. అట్లు జీవించు వానిని ద్వంద్వము లంటవు. మనస్సు నిర్మలమగును. అట్టి మనస్సు బుద్ధియందు స్థిరపడు అర్హతను పొందును. ఇట్లు రాగద్వేష విముక్తుడు కాని వానికి సుఖశాంతులు ఉండజాలవు. కామము ప్రధానము కాగా ఇంద్రియ ద్వారమున మనస్సు పరిపరి విధముల పరిగెత్తుచు అలసిపోవుటయే గాని సుఖశాంతు లెట్లు దొరుక గలవు?

నిజమునకు సుఖశాంతులను కోరుట కూడ కామమే. కోరినంత మాత్రమున సుఖశాంతులు జీవునకు కలుగవు. వాటికై యత్నించుట కూడ నిష్ప్రయోజనము. వానిని పొందుటకు కోరికను తీవ్రము, తీవ్రతరము చేయుట ఉపాయము కాదు. వానిని పొందవలెనన్నచో జీవుడు నిరంతరము తనను కర్తవ్య నిర్వహణ మందు నియమించుకొను చుండవలెను. కర్తవ్య నిర్వహణము చేయువానికి పుట్టలు పుట్టలుగ భావములు జనింపవు. కామ ప్రవృత్తి కర్తవ్య ప్రవృత్తిగ మారును. అట్టి కర్తవ్యోన్ముఖునకు కామము లేకుండుట వలన కర్మఫలములపై కూడ ఆసక్తి యుండదు. దీర్ఘ కాలము కర్తవ్యమునే ఆచరించు చుండుటవలన చిత్తశుద్ధి ఏర్పడి సుఖశాంతులు ఆవరించగలవు. మరియొక మార్గము లేదు.

# 35

## అంకుశము

ఇంద్రియాణాం హి చరతాం యన్మనోఽనువిధీయతే ।
తదస్య హరతి ప్రజ్ఞాం వాయు ర్నావ మివాంభసి ॥ 67

నీటియందుతేలు నావ గాలినిబట్టి పోవుచుండును. గాలి వాలును బట్టి నావ పలుదిక్కులకు ఈడ్వబడు చుండును కదా! అట్లు పలు విధములుగ ఈడ్వబడుట నావకు ప్రయాణ మెట్లు కాగలదు?

ముక్కుతాడు వేయని ఎద్దు చేలయందుబడి పంటను విధ్వంసము చేయుచు, చిందులు వేయుచు తినినంత తిని, మిగిలినది పాదములతో త్రొక్కుతూ స్వైర విహారము చేయును. అట్టి ఎద్దు పొలమున కెట్లు ఉపయోగపడగలదు?

కళ్ళెములేని గుఱ్ఱములతో గూడిన రథము, గుఱ్ఱములెటు లాగినచో అటుపోవును. తత్కారణముగ రథము నశించునుకదా !

శిక్షణము, మావటి లేని మదపుటేనుగు అపాయకరము కదా !

అట్లే రాగద్వేషముల ననుసరించుచు, ఇంద్రియముల

ద్వారా ఇంద్రియార్థముల కొరకై పరువెత్తు మనస్సు మనుజుని హరించును.

నావ పయనించవలె నన్నచో తెరచాప, చుక్కాని ఏర్పరచ వలెను. ఎద్దు ఉపయోగపడవలె నన్నచో ముక్కుకు తాడు బిగించి, శిక్షణ నిచ్చి అరక కట్టించవలెను. గుఱ్ఱములు ప్రయాణమునకు వినియోగపడవలె నన్నచో కళ్ళకు గంతలు కట్టి, కళ్ళెము వేసి పగ్గములు పట్టి నడిపించవలెను. మదపుటేనుగు బలము విని యోగపడవలె నన్నచో అంకుశముతో మావటివాడు అధిష్ఠించి యుండవలెను. అట్లే ఇంద్రియములను, మనస్సును అధిష్ఠించి మానవ ప్రజ్ఞ జీవనయానము వైభవోపేతముగా నిర్వర్తించ దలచు కొన్నచో కర్తవ్యమను అంకుశముతో మనసును నడిపించవలెను. లేనిచో ప్రజ్ఞ హరింపబడునని శ్రీకృష్ణుడు తెలుపుచున్నాడు.

# 36

## హెచ్చరిక

తస్మాద్యస్య మహాబాహో నిగృహీతాని సర్వశః ।
ఇంద్రియాణీంద్రియార్థేభ్య స్తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥ 68

పొరబడని, హెచ్చుతగ్గులు లేని స్థిరమైన జ్ఞానము వలయునా? అట్టి జ్ఞానమును ప్రతిష్ఠింప జేయుటకు ఉత్సహించుచున్నావా? అట్లయినచో నీ పంచేంద్రియముల వినియోగము పరిశీలింపుము. వాక్కు, కర్మేంద్రియముల వినియోగమును కూడ పరిశీలింపుము. వానిని కర్తవ్యమునకే వినియోగించుట, ఇతర సమయముల యందు విశ్రాంతి నిచ్చుట అను దీక్షను స్వీకరింపుము. జ్ఞానేంద్రియములు, కర్మేంద్రియములు కేవలము కర్తవ్యమునకే వినియోగింపబడుటచే విషయాసక్తి గొనక అప్రమత్తములై చురుకుగ ఉండగలవు. కర్తవ్యము గోచరించినపుడెల్ల ప్రతిస్పందించగలవు. లేనిచో విశ్రమించ గలవు. విషయానురక్తి అను వ్యాధిని కర్తవ్యమను ఔషధముతో పరిపూర్ణముగ నిర్మూలించుము. ఇట్లు ఇంద్రియార్థముల నుండి ఇంద్రియములను సర్వవిధముల నిగ్రహించ వచ్చును.

భగవంతుడు పై శ్లోకమున "సర్వశః" అను పదమును వాడినాడు, అనగా సర్వ విధముల పరిపూర్ణముగ ఒకించుక కూడ విషయాసక్తి లేకుండగ నిర్మూలించినవే జ్ఞానము స్థిరపడును. నావ ఎంత కట్టుదిట్టముగ నున్నను చిన్న రంధ్రము కారణముగ మునిగి పోవును గదా! నీటి కుండకు ఎంత చిన్న చిల్లు పడినను నీరు కారిపోవును కదా! అట్లే జ్ఞానము సుప్రతిష్ఠమై యుండవలెనన్నచో విషయాసక్తి యను రంధ్రమునకు తావీయరాదు సుమా! అని భగవానుడు హెచ్చరించుచున్నాడు.

## 37

# చీకటి - వెలుగు

**యా నిశా సర్వభూతానాం తస్యాం జాగర్తి సంయమీ ।**
**యస్యాం జాగ్రతి భూతాని సా నిశా పశ్యతో మునేః ॥ 69**

మునులకు, యోగులకు ఈ జగత్తున కనబడునది సామాన్యులకు కనపడదు. సామాన్యులకు గోచరించినది సంయమముగల యోగులకు గోచరించదు. యోగులకు, మునులకు విశ్వమంతయు వ్యాపించి ఉన్న ఒకే ఒక చైతన్యము గోచరించును. ఆ మహాచైతన్యమే పెక్కు విధములుగా ఎట్లు నర్తించుచున్నదో గోచరించును. వైవిధ్యము గల ఆ నర్తనము యొక్క వైభవమును దర్శించుచు వారానందింతురు. వారియందు స్వ-పర భేదములు గాని, సంఘము నందలి స్థితిగతులు గాని, జీవులయందలి భేదములు గాని భాసింపవు. ఉదాహరణకు ఒక మనిషి ఎట్టి విలువైన వస్త్రములు ధరించెనో, ఎటువంటి ఆభరణ ములు ధరించెనో, అతని రూపురేఖ లెట్లున్నవో యోగి గమనించడు. ఎదురుగా నిలబడిన జీవమును, జీవచైతన్యమును మాత్రమే దర్శించును. జాతి మత కుల లింగ భేదములు గోచరింపవు.

సమాన్యులకు జాతి మత కుల లింగ భేదములు గోచ రించును, ఆకారములు, వాని వికారములు గోచరించును. వస్త్రా భరణములు యొక్క విలువ గోచరించును. ఎదుటివారి తప్పులు గోచరించును. సంఘమున గల ఇంద్రియార్థములు గోచరించును. మరెన్నెన్నో చిల్లర విషయములు గోచరించును. కాని యోగులకు గోచరించు జీవచైతన్యము, దాని వెలుగు, వైభవములు సామాన్యు లకు గోచరించవు.

పై విధముగ యోగులకు గోచరించునవి జీవులకు గోచ రించకుండుట యోగుల పగలు, జీవులు రాత్రియని భగవంతుడు చమత్కారముగ తెలిపినాడు. అట్లే జీవులు చూచు లౌకిక విషయ ములు యోగుల దృష్టిని ఆకర్షించవు. గనుక జీవుల పగలు యోగు లకు రాత్రి అనికూడ తెలిపినాడు.

మునులు, యోగులు, ఆత్మ సంయమము చెందిన వారిని, దర్శన జ్ఞానము కలిగివారిని, సతతము మననము నందుండు వానిని కూడ భగవానుడు ఈ శ్లోకమున తెలియజెప్పినాడు. సంయమ మనగా ఇంద్రియములు మనస్సునందు, మనస్సు బుద్ధి యందు, బుద్ధి నేను అను ప్రజ్ఞ యందు ఇమిడి యుండుట. అట్టివాడు "జాగర్తి"గ నుండును. అనగా మేలుకొని ఉండును.

'పశ్యతః' అనగా సమస్తమునందు మేలుకొని యున్న దానిని మెలకువతో దర్శించు చుండును. 'ముని' అనగా దర్శించిన దానిని అదే సమయమున మననము చేయుచుండును. అట్టివాని దృష్టికి చీకటి లేదు. అనగా కనపడకుండుట లేదు.

# 38

## కామ స్వరూపం

ఆపూర్యమాణ మచలం ప్రతిష్ఠమ్
సముద్ర మాపః ప్రవిశంతి యద్వత్ ।
తద్వత్కామా యం ప్రవిశంతి సర్వే
స శాంతి మాప్నోతి న కామ కామీ ॥ 70

సముద్ర దర్శనము శుభకరమని పెద్దలు తెలుపుదురు. సృష్టియందు సముద్రమునకు ఒక విశిష్ట స్థాన మున్నది. సముద్ర మునందు నదుల నుండి, వాగుల నుండి, వర్షపాతము నుండి ఎంత జలము చేరినను సముద్రము పొంగదు. ఇదియొక విశిష్ట స్థితి. ఎన్ని విషయములు సముద్రమున చేరినను సముద్రమట్లే యుండును. దానియందు సమస్తము ఇముడును. ఇతరములు వచ్చి చేరుట వలన సముద్రము ఎల్లలు దాటదు. దానికి స్థిరమైన హద్దుమీరని ఉనికి కలదు. అది పూర్ణమైనది. అనగా నింపుటకు అవకాశము లేనిది. నిండియున్నది గనుక నింపుటకు వీలుపడదు.

అట్లే శాంతిని పొంది బుద్ధియందు స్థిరపడిన వానిని మరియే భోగ్య విషయములు మరింత శాంతిని, తృప్తిని కలిగింప జాలవు. అతడు శాంతిగను తృప్తిగ నుండుటచే భోగ్య విషయములు

మరింత శాంతిని, తృప్తిని ఇచ్చుట జరుగదు. నిండిన సముద్ర మున మరింత నీరు చేర్చిన ఎట్లు పొంగదో శాంతి, తృప్తితో నిండిన మనస్సు మరి యే ఇతర విషయములకు పొంగదు.

సముద్రము నుండి సూర్య కిరణములు జలములను ఊర్ధ్వగతికి కొనిపోయి నను సముద్రమింకదు. అట్లే విషయలేమి కారణముగ శాంతుని చిత్తము క్రుంగదు. పొంగుట-క్రుంగుట సముద్రమునకు, శాంతచిత్తునకు లేవు. ఇదియే బ్రహ్మానంద స్థితి. బుల్లి బుల్లి కోరికల యందు జీవిత మంతయు సతమతమగు వానికి ఈ స్థితి దుర్లభము. ఊహించుటకైననూ వీలుపడనిది. భగవానుడీ విధముగ తన నిజస్థితిని అర్జునునికి సూచన ప్రాయ ముగ తెలిపినాడు. ప్రస్తుతము అర్జునుడున్న పరిస్థితికి భగవంతు డందించిన ఉదాహరణము అగ్రాహ్యము (బొత్తిగా అర్థము కాని విషయము). అయినను బీజప్రాయముగ అత్యుత్తమ విషయ మును శిష్యునియందు ఆవిష్కరించుట సద్గురువు యొక్క దూర దృష్టి మరియు కరుణ అని తెలియవలెను.

# 39

# శాంతి సూత్రము

విహాయ కామాన్ య స్సర్వాన్ పుమాం శ్చరతి నిస్స్పృహః ।
నిర్మమో నిరహంకారః స శాంతి మధిగచ్ఛతి ॥ 71

ఏ మనుజుడైతే రాగద్వేషములను విడుచునో, ఎవడైతే విషయముల యందు ఆసక్తి విడుచునో, మమకారమును అహంకారమును విడుచునో అట్టివాడు శాంతిని పొందునని భగవానుడు ఈ శ్లోకమున తెలుపుచున్నాడు. ఇందు నాలుగు స్థితులను వివరించుచున్నాడు.

ఇందు మొదటిది కామ విసర్జనము. సర్వమతముల యందు, సర్వశాస్త్రముల యందు కామమును విసర్జింపుమని తెలుపబడు చునే యుండును. కర్తవ్యము ననుసరించుట వలన మాత్రమే కామము విసర్జించుటకు వీలుపడునని తెలియవలెను. కర్తవ్య మనగా చేయవలసిన పని. కామ మనగా చేయదలచిన పని. తాను తలచిన పనులు చేయుటకాక, వలసిన పనులను చేయుట ముఖ్యము. ఇవి ఆరోహణ క్రమమునకు గడప వంటివి.

అట్లు కర్తవ్యమును మాత్రమే చేయ దీక్ష పూనిన వానికి మార్గమున అనేకానేక విషయములు కన్పట్టుచుండును. అందను రక్తి కొన్నవాడు కర్తవ్య విముఖుడు కాగలడు. విషయానురక్తుడు కర్తవ్యపాలనము చేయలేడు. అందుచే విషయాసక్తిని విసర్జించుచు, కర్తవ్యము నిర్వర్తించుచు సాగిపోవలెను.

అటుపైన సాధకునకు మమకార మను అవరోధ మేర్పడును. నాది అను భావమే మమకారము. తన శరీరము, తన వారు, తన సంపద అనునవి మమకార స్థానములు. తనది అనుకొనినదంతయు నిజమునకు దైవమునదే అని భావించుట సాధనగ సాగవలెను. శరీరమునకు, తనను ఆశ్రయించిన వారికి, తన చుట్టూ ఏర్పడిన సంపదకు యజమాని దైవమే యనియు, తాను కేవలము ధర్మకర్త అనియు భావింపవలెను. ధర్మకర్త యనగా వాని యందు తన ధర్మము నిర్వర్తించుటే గాని యాజ మాన్యము కాదు. ఇట్టి భావనను స్థిరపరుచుకున్నవానికే మమకార మను పొర తెగును.

అహంకారము వర్జించుట తుది మెట్టు. కర్తవ్యమును చేకొని కామమును వర్జించుట, కర్తవ్య పాలనమున ఆకర్షణీయమగు విషయముల యందు అనురక్తిని వర్జించుట, "తనది" అను భావమును వర్జించుట అను మూడు సోపానములను అధిరో హించిన సాధకుడు "తాను" అను భావమును కూడ వర్జించుట తుది మెట్టు.

నిజమునకు తానులేడు. తానుగ దైవమే యున్నాడు. కాని తా నున్నాడననుకొను చున్నాడు. అట్లనుకొనుటయే అహంకారము. తనకొక ప్రత్యేక అస్థిత్వము లేదు. దైవమే జీవుడుగా నుండగ, జీవుడు తా నున్నాడనుకొనుటయే మొదటి మాయావరణము.

బంగారము లేక ఉంగరము లేదు. మట్టి లేక కుండ లేదు. సముద్రము లేక కెరటము లేదు. దైవము లేక జీవుడు లేడు. ఈ జ్ఞానము పూర్ణ జ్ఞానమునకు తుది మెట్టు. దీని నధిరోహించు టకు "తా నుండుట అనగా నేమి?" అను అంశముపై విచారణ తీవ్రముగ సాగవలెను. సమాధానము దర్శించినపుడు అహంకారము నశించును. నిరహంకారి యగును. అతనిది స్థిరమైన శాంతి.

అహంకారికి శాంతి లేదు. మమకారికి అసలు లేదు. విషయాను రక్తునకు బొత్తిగ శాంతి లేదు. కాముకునకు అశాంతి స్థిరముగ నుండును. ఈ నాలుగ సోపానములు అధిరోహింప జేయుటకే పదునెనిమిది అధ్యాయముల గీతోపదేశము. ఈ సోపానముల నధిరోహించుటనే ఉపనిషత్తులు సూచించుచున్నవి. యోగవిద్య బోధించుచున్నది. బ్రహ్మవిద్య ఘోషించుచున్నది.

## 40

# బ్రహ్మ నిర్వాణము

**ఏషా బ్రాహ్మీస్థితిః పార్థ ! నైనాం ప్రాప్య విముహ్యతి ।**
**స్థిత్వాఽస్యా మంతకాలేఽపి బ్రహ్మనిర్వాణ మృచ్ఛతి ॥ 72**

ఇది సాంఖ్యయోగ మను అధ్యాయమునకు చిట్టచివరి శ్లోకము. ఈ శ్లోకమున భగవంతుడు అంతకుముందు శ్లోకము లలో వివరించిన సోపాన క్రమమునకు గమ్యమును నిర్వర్తించు చున్నాడు. అర్జునుడు ప్రజ్ఞయందు స్థితి గొన్నవాని లక్షణములను గూర్చి నాలుగు ప్రశ్నలు శ్రద్ధాభక్తులతో శ్రీకృష్ణుని అడిగెను. స్థిత ప్రజ్ఞుని లక్షణము లేవి? అతడేమి పలుకును? ఏ రీతిగ నుండును? ఎట్లు సంచరించును? అనునవి ఆ ప్రశ్నలు. ఈ ప్రశ్న లన్నిటికిని సమాధానములు వివరించుచు శ్రీకృష్ణుడు క్రమశః 71వ శ్లోకము చేరునప్పటికి నిరహంకార స్థితిని ఆవిష్కరించెను.

నిరహంకార స్థితి చేరినవారికి సమస్తము వ్యాపించియున్న తత్త్వమే తానుగా నున్నదనియు, మరియు సమస్త జగత్తు అదియే నిండియున్న దనియు తెలియును. అంతటిలో నిండియున్నది, అన్నిటియందు నిండినది, తనయందు కూడ నిండియుండుటచే తాను, ఇతరము అను భేదము నశించును. అంతటిలో నిండిన

తత్త్వమును బ్రహ్మము అందురు. ఈ తత్త్వమును దర్శించిన వాని స్థితి బ్రాహ్మీ స్థితి. ఇది పొందినవానికి తాను కానిది ఏమియు కనపడదు. తానే సమస్తమై యుండుటచే మరియు సమస్తమే తానుగ నుండు టచే మరియొకటి లేని స్థితి ప్రాప్తించుటచే మోహము, అంత్య కాలము అనునవి కూడ లేకుండును.

మరియొకటి లేని స్థితిని గూర్చి భగవానుడు భాషణము చేయుచున్నాడు. ఇదియొక అద్భుతమైన స్థితి. అనిర్వచనీయమైన స్థితి. అంతకుముందున్నవి అపుడుండవు. అంతకుముందు గోచరించిన సత్యములు కూడ నుండవు. స్వప్నమున అనేకానేక రూపములను, సన్నివేశములను, భావములను అనుభూతి చెందుచున్న జీవుడు మేల్కాంచినపుడు స్వప్నము లోని విశేషములన్నియు, మేల్కాంచినపుడు ఎట్లు లేవో, అట్లే బ్రహ్మమునందు మేల్కాంచినవానికి ఈ సమస్త సృష్టియు, అందలి జీవులు, లోకములు స్వప్నమని తెలిసి నవ్వుకొనగలడు. అతని ఆనందమునకు అవధులు లేవు. అదియే బ్రహ్మానందము.

## OTHER BOOKS THROUGH
# MASTER K. PARVATHI KUMAR

*The following books are available in: English (E), German (G), Spanish (S), French (F), Hebrew (H), Telugu (T), Hindi (HI) and Kannada (K) languages.*

**BOOKLETS :**

| | | |
|---|---|---|
| 1. | LORD MAITREYA -The World Teacher | E/G/S/F |
| 2. | THE WHITE LOTUS | E/G/S |
| 3. | WISDOM BUDS | E/G/S |
| 4. | SPIRITUALISM, BUSINESS & MANAGEMENT | E/G/S |
| 5. | THE PATH OF SYNTHESIS | E |
| 6. | THE ETHERIC BODY | E/G/S |
| 7. | MARIA MAGDALENA | E/G/S |
| 8. | TIME THE KEY | E/G/S |
| 9. | LISTENING TO THE INVISIBLE MASTER | E/G/S/F/H |
| 10. | GOOD FRIDAY | E/G/S/F/H |
| 11. | BHRIKTA RAHITA TARAKA RAJAYOGAMU | T/K |
| 12. | MARRIAGE - A SACRAMENT | E |
| 13. | MASTER C.V.V. YOGAMU-KARMARAHITYAMU | T |

**BOOKS :**

| | | |
|---|---|---|
| 14. | MITHILA –A New Age Syllabus | E/G/S |
| 15. | THE AQUARIAN MASTER | E/G/S |
| 16. | SOUND –The Key & its Application | E/G/S |
| 17. | ASHRAM LEAVES | E/G/S |
| 18. | SANKHYA –The Sacred Doctrine | E/G/S |
| 19. | VENUS –The Path to Immortality | E/G/S |
| 20. | THEOSOPHICAL MOVEMENT | E/G/S |
| 21. | SHIRDI SAY SAYINGS | E/G/S |

| | | |
|---|---|---|
| 22. | SPIRITUALITY IN DAILY LIFE | S |
| 23. | THE MASTERS OF WISDOM | S |
| 24. | MEDITATION & GAYATRI | S |
| 25. | WISDOM TEACHINGS OF VIDURA | E/G/S |
| 26. | ON HEALING | E/G/S |
| 27. | SPIRITUAL FUSION OF EAST & WEST | E |
| 28. | SRI SASTRY GARU | E/G/S/F/T |
| 29. | THE AQUARIAN CROSS | E/G/S |
| 30. | HERCULES –The Man & the Symbol | E/G/S |
| 31. | MANTRAMS –Their Significance & Practice | E/G/S |
| 32. | SRI DATTATREYA | E/G/S/T/HI |
| 33. | SATURN –The Path to Systematised Growth | E/S |
| 34. | JUPITER –The Path of Expansion | E/S |
| 35. | MASTER E.K. –The New Age Teacher | E/G/S |
| 36. | AMANASAKUDU | T/K |
| 37. | VRUTRASURA RAHASYAM | T |
| 38. | THE DOCTRINE OF ETHICS | E |
| 39. | DHANAKAMUNI KATHA | T |
| 40. | ANTARDARSANA DHYANAMULU | T |
| 41. | THE SPLENDOR OF SEVEN HILLS | E/T/Hi |
| 42. | DOCTRINE OF ETERNAL PRESENCE | E |
| 43. | ASANGUDU | T |
| 44. | SARASWATHI - THE WORD | E |
| 45. | MANA MASTERU GARU | T |
| 46. | GEETOPANISHAD | T |
| 47. | SRI LALITHA | T |
| 48. | POOJA VIDHANA PRASASTYAMU | T |
| 49. | GAYATRI MANTRA PRASASTYAMU | T |
| 50. | Katha Deepika | T |